

## నేలమీద జాబిలి - శరత్‌చంద్రుడు

రెండు కాదు, మూడు కాదు, నాలుగు కళ్ళు!
నాలుగు దిక్కుల రహస్యాలను ఒడిసిపట్టిన  మహిమాన్విత నేత్రాలు!!
నాలుగు వేదాల సారాన్ని బోధించే మౌన నాదాలు!!
వారి రెండు కళ్ళు - ప్రకృతిలోని ద్వంద్వాలు
వారి సులోచనాలు - ద్వంద్వాలను సమన్వయం చేసే దివ్య ప్రవచనాలు!!
అధర తీరాన అనుక్షణం దరహాస దర్శనం.
భుజాన ఉన్నది భుజంగ భూషణమా - అనంత ప్రేమ నిధుల నిలయమా!
స్వచ్ఛమైన శీల పరిమళాలు వెదజల్లుతున్నాయి - మల్లెపువ్వులాంటి మడత నలగని శ్వేత వస్త్రాలు.


వైద్యుడు కాని డాక్టరు - భవరోగాలకు వైద్యుడు.
నా, తన బేధం లేని అధునాతన రూపంలోని సనాతనుడు! నిత్యనూతనుడు!
మబ్బుల దాగిన సూర్యుడు - నేలకు దిగిన చంద్రుడు.
అతని మార్గం సహజం, సుందరం, సుమధురం - సరళం సులభతరం
సర్వత్రా ఆదరణీయం - అందరికీ ఆచరణీయం
నిత్య వసంతపథం - సత్యపథం గురుపథం సద్గురుపథం సాయిపథం... ఆనందపథం.

\-
పురిఘెళ్ళ వెంకటేశ్వర్లు

www gurukrupa.info | +91 83672 00045

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!  సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!

# మాతృప్రేమ గురువే ధీమా!



"మా సాంప్రదాయమే వేరు"
అన్నారు శ్రీసాయిబాబా.
శ్రీసాయి మాటల్లోని జ్ఞానరత్నాలను
తమ ఆచరణ ద్వారా
మాకందించారు గురుదేవులు.
"మన ఇష్టదైవంపట్ల ప్రేమతో వ్యక్తం చేసే
ప్రతిపని పూజే" అన్నారు మా గురుదేవులు.
ఎందరెందరో వారి చరణాలు చేరి...
శ్రీసాయి చరణాలకు అంకితమయ్యారు.
ప్రతీజీవి వారి అనుగ్రహంతో ఎవరికి వారిదే
అయిన ఒక చక్కటి ప్రేమ త్రోవను
సృష్టించుకుంటున్నారు
శ్రీసాయిని చేరుకునేందుకు...
నిజానికి వారు మాకు చూపింది
ఇరుకైన దారి కాదు... కోట్లాది జీవులు
ఒకేసారి శ్రీసాయిని చేరగల
అఖండ రహదారి...
మమ్ము శ్రీసాయి చరణాలు
చేర్చాలన్న మాతృప్రేమ వారిది...
మా గురుచంద్రులు పరుసవేది.

25 అనుగ్రహానంద మహోత్సవం
రసరమ్య రజతోత్సవం

# గురుకృప

శ్రీరామనవమి సంచిక





## సద్గురువుకు దగ్గర కావాలి అంటే?

**శిష్యుడు :** గురువుగారూ, ఇప్పుడు మీకు దగ్గర కావాలంటే మీరు చెప్పినట్టు నడుచుకోవాలి. అలా మీ మీద ప్రేమ పెరగాలి, మీరు చెప్పినవి శ్రద్ధగా చేయాలంటే దానికి ఎలా వుండాలి?

**గురువు :** ప్రేమ ఉంటే ఆటోమేటిక్‌గా చేస్తావు. దానికేమీ రూల్స్ అక్కర్లేదు. నియమాలూ అక్కర్లేదు. దానికేమీ పెద్ద విశేషాలు తెలుసుకోవాల్సిన అవసరమూలేదు. ఏం లేదు. ప్రేమ ఉంటే ఇటువంటి సత్సంగాలు కూడా అవసరంలేదు. అది (ప్రేమ) గానీ ఉంటే!

**శిష్యుడు :** ఆ ప్రేమను పెంచుకోవడం ఎట్లా?

**గురువు :** అదే అవుతుంది. చేస్తూ ఉంటే అవుతుంది. ఆ పని అలా చేస్తూ ఉంటే మనకు ఎటువంటి ఫలితాలొస్తాయో తెలుస్తూ వుంటాయి. తెలిసేకొద్దీ ఇంకా ఇంకా బాగా చేసుకొంటాము. అదిలేదనుకో, ఊరకనే రూల్స్ ప్రకారం చేసినట్లవుతుంది. మీరు చెప్పారు, కానీ నేను చెయ్యలేకపోయాను అని అనవలసి ఉంటుంది. చెయ్యలేకపోవడం ఎందుకు జరుగుతుంది అనంటే ప్రేమ అంత బలంగా లేకపోవడం, ఆ చేసేటప్పుడు దేని గురించి చేస్తున్నామో దానిమీద ఎక్కువ ప్రేమ ఉండటం.. ఈ రెండే కారణం. మీ మీద నాకు అపారమైన ప్రేమ ఉంది, మీమీద కంటే ఇంక దేని మీదా ప్రేమలేదు, అయినా చెయ్యలేకపోతున్నాను అంటే మాత్రం అది అబద్ధం.

**శిష్యుడు :** ప్రేమ ఎంత ఎక్కువ ఉంటే అంత గ్రేస్, బ్లెసింగ్స్, ఎక్స్‌పీరియన్స్ వస్తాయా గురువుగారు?

**గురువు :** ఏం లేదు... ప్రేమ ఎక్కువున్నా, తక్కువున్నా... దానికి, దీనికి ఏం సంబంధం లేదు. ప్రేమ ఎక్కువంటే మీరు ఎక్కువ అనుభవిస్తారు. గ్రేస్ క్వాలిటీలో ఏమీ తేడారాదు. ప్రేమ ఉన్నా లేకపోయినా మీ మీద      ఉండే గ్రేస్ అట్లాగే వుంటుంది. కాని మీరు ఉపయోగపెట్టుకోరు. ప్రేమ ఉంటే ఉపయోగపెట్టుకుంటారు. ఎక్స్‌పీరియన్స్ చేస్తారు.

**శిష్యుడు :** చేయలేకపోతున్నప్పుడు అది చెయ్యాలంటే ప్రేమ ఉండాలి అన్నారు కదండీ... అది ఉండాలంటే?

**గురువు :** దానికేమీ లేదు.

**శిష్యుడు :** మార్గం లేదంటారా?

**గురువు :** దానికై దానికి కలగాలి అంతే. కొంతమందికి కలిగి, వేరే వేరే వాటి ద్వారా పోతుంది అనుకున్నప్పుడు సత్సంగాల్లాంటివి, ఎక్కువ కాంటాక్ట్‌లో వుండటం లాంటివన్నీ దోహదం చేస్తాయి. అవి ప్రేమను పుట్టించవు. ఒక కంచెలాగా ఉపయోగపడతాయి. అంతే...

**- సాయిపథం, శిరిడీ**



కాదు. ఒకనాడు కరుణా సముద్రులైన వారు – ఆనాటి వారి తండ్రిగారి శ్రాద్ధ సమయంలో వండి ఉన్న పదార్ధములను ఆకలిగా ఉన్న భిక్షగానికి కార్యక్రమమునకు పూర్వమే ఇచ్చివేయడం జరిగింది. హతాశులైన బ్రాహ్మణులు 'ప్రాయశ్చిత్తం' చేసుకుంటేగానీ ఆ కార్యము నిర్వర్తించమని, అందుకు గంగాస్నానమే సరి అయిన ప్రాయశ్చిత్తమని ఇబ్బంది కలిగించారు. అయ్యవాల్ శరీరస్థితి అట్టి ప్రయాణమునకు అనుకూలము కూడా కాదు. సంపూర్ణ సమత్వబుద్ధితో తక్కువజాతి వానికి ఆహారమిచ్చిన వారు అదే సమత్వబుద్ధితో 'గంగ'ను భక్తిగా పిలిచిన ఆ నదీమతల్లి వారి ప్రాంగణముననే రాలేదా! "తల్లీ! ఇదిగో నిన్ను కీర్తిస్తూ అష్టశ్లోకములతో నిన్ను వేడుకుంటున్నానని" గంగాష్టకముతో వేడుకున్నారు అయ్యవాల్. ఇంటిలోని బావి నుండి నీరు పొంగి పొరలుతూ, తిరువైసలూర్‌లోని వీధులన్నీ జలమయమవ్వడం మొదలయ్యింది. అయ్యవాల్‌వారి సమత్వంతో వర్షించిన భగవంతుని మమతకు అచ్చెరువొందిన బ్రాహ్మణోత్తములు స్వామివారి చరణాలను శరణన్నారు. మూడు వందల సం||ల క్రితం కార్తీక అమావాస్య రోజున జరిగిన ఈ సంఘటనను ఇప్పటికీ ఉత్సవంగా జరుపుకుంటారు. గృహస్తు అయిన ఆ మహితాత్ముని నివాసము 'మఠం'గా ఇప్పటికీ సుప్రసిద్ధమే.

నామబోధేంద్రులు, శ్రీధర అయ్యవాల్, మరుదనల్లూర్ సద్గురుస్వామి వార్ల త్రయమును దక్షిణభారత నామ సాంప్రదాయ సంకీర్తనాకారులుగా పూజిస్తారు. 'రామనామ' వైభవాన్ని గుర్తిస్తూ, పరమాచార్య స్వామివారు రామనామాన్ని లిఖించుకునే పుస్తకాలను పంచడం, పిల్లలు రామనామాన్ని రాస్తే వారికి వెండి, బంగారు కామాక్షి అమ్మవారి నాణాలను ఇవ్వడం–ఇలా నామస్మరణాసక్తిని అందరిలోను కలిగించేవారు. మూర్తీభవించిన వైరాగ్యము సదాశివబ్రహ్మేంద్రులైతే "పిబరే రామరసం... రసనే పిబరే రామరసం" అంటూ "ఓ జిహ్వా! రామరసపానం చేయవే" అంటూ భగవన్నామ వైభవాన్ని తెలియచెప్పారు.

– గురుకృప



గురువు అంటే ఒక ఫార్మ్ (రూపం) కాదు.
గురువు అంటే గుర్తు. ఆ గుర్తు పెట్టుకొని ఉండటమే
గురు సన్నిధి. ఎక్కడున్నా సరే!
దేన్ని గుర్తుపెట్టుకుంటామో అదే మన గురువు.

– శ్రీబాబూజీ



సంపుటి : 25
సంచిక : 2

ఏప్రిల్ 10
2022



గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి
– గురుకృప

6 పూజ్యశ్రీ బాబూజీ అనుగ్రహభాషణం
–సాయిపథం, శిరిడీ

20 సద్గురు సమ్మోహనం – సాయినామ జగన్మోహనం
– 'నామం' జగన్మోహన్‌రెడ్డి

24 నేనెవ్వరికి ఏమీ నేర్పించను..
– డా||ఎస్.సాయి వరప్రసాద్ రావు

27 గురుకృపాలహరి
– గురుకృప



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## పథగామి

### ఏది నామం... ఏది రూపం... ఏది నిను తెలిపేటి వేదం...

### తన్మయత్వపు తావు నుండే పేరు మరచిన ప్రేమతత్త్వం

దేవుడి ఉనికి మనకు కష్టాల్లోనే తెలుస్తుంది. వెన్న వంటి మనసు, వెన్నెల వంటి చూపు, తేనె వంటి పలుకు మనిషి సంస్కారాన్ని తెలియచేస్తాయి. వీటి కోసం మనిషి ప్రత్యేక సాధన చేయనవసరం లేదు. అవి మానవ స్వభావ సిద్ధాలే!

నవ్వగలిగే ప్రాణి, ప్రేమించగలిగే ప్రాణి మనిషి మాత్రమే. పుట్టుకతో వచ్చిన లక్షణాలను బంధాలు కట్టి పడేసి అరువు తెచ్చుకున్న అసహజ లక్షణాలైన కోపం, ఈర్ష్య, అసూయ, మదమాత్సర్యాలను జీవితం సంతరించుకుంటుంది. మనిషి మనుగడే మారిపోతుంది.

మనసు, చూపు స్వచ్ఛంగా ఉండే పసితనంలోనే, ఉయ్యాలలోనే అయినవాళ్ళు అనుబంధాలతో ముడేస్తారు. అమ్మ, నాన్నలతోపాటు బాంధవ్యాలన్నీ చుట్టుముట్టేలా అందర్నీ నా వాళ్ళు అనిపిస్తారు. అప్పుడే తన, పర బేధం ప్రారంభమై, నాది అనే స్వార్థం బిగుస్తుంది. 'నేను' అనే అహంకారం మొదలవుతుంది. మన చిన్నతనంలో నీ ముక్కేది, నీ కళ్ళేవి, నీ నోరు అంటూ వాడికి 'నావి' అనే భావాన్ని నేర్పిస్తున్నాము.

ఉన్న శక్తిని మరిచిపోయి, మానవతా విలువలు దూరమై స్వార్థం పుంజుకున్నపుడు ఆధ్యాత్మిక ఆవశ్యకత పెరుగుతుంది. ఎక్కడ విజ్ఞానశాస్త్రం అంతమవుతుందో అక్కడ ఆధ్యాత్మికత మొదలవుతుంది అంటారు పెద్దలు. భౌతిక స్థితిగతులకు లోబడి మనిషి నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతాడు. జీవితం నిస్సారమనుకుంటాడు. ఆ సమయంలో వేదాంత జ్ఞానం జవసత్వాలనిస్తుంది.

నిరాశ–జీవితంలోని అవకాశాలను దూరం చేస్తుంది. ఈర్ష్య, అసూయ, ద్వేషం జీవితాన్ని బలితీసుకుంటాయి. దుర్యోధనుడే అందుకు ఉదాహరణ. కష్టాలను ఎదుర్కొని, శక్తియుక్తులను కూడగట్టుకుని, భగవంతుడి రక్షణలో ఉత్సాహంతో కృషి చేయడమే విజయానికి మార్గమనేందుకు పాండవులే ఉదాహరణ.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. మనిషి తన సహజ ప్రవృత్తి అయిన చిరునవ్వు, మంచి మాట, ప్రేమభరిత హృదయంతో జీవించడమే ఆధ్యాత్మిక జీవన విధానం. అది మనిషికి మాత్రమే దేవుడిచ్చిన వరం.

***వశమైతేనే దశ మారేది:*** సృష్టికర్త గొంగళిపురుగును అందమైన రంగుల సీతాకోకచిలుకగా మారుస్తాడు. బొగ్గు–వజ్రాలుగా రూపాంతరం చెందడం చూస్తున్నాం. కాలం, ఒత్తిళ్ళ ద్వారా ఆ సృష్టికర్తే మనుషుల





సంకీర్తనలోని ఆంతర్యాన్ని, "మనిషి దైవంగా ఎదిగేక్రమంలో" నామస్మరణకున్న భూమికను తెలియచెప్పారు సద్గురుచంద్రులు, వైతాళికులు అయిన మా గురుచంద్రులు శ్రీబాబూజీ. నామబోధేంద్రుల అధిష్ఠానమున శ్రద్ధాళువులైన భక్తజనులకు ఈ నాటికీ లీలగా రామనామము వినబడుతుందంటే అతిశయోక్తి ఏముంటుంది! కుంభకోణమునకు దగ్గర్లోని గోవిందపురంలో స్వామివారి బృందావనము (సమాధి స్థానము) ఆర్తులకు, సంకీర్తనాసక్తులకు సాంత్వననిచ్చు చలివేంద్రము. పరమాచార్యస్వామి వారికి ఈ అధిష్ఠానము మిక్కిలి ప్రీతిపాత్రము. రామ నామమునకు వారు కూడా ఎంతో ప్రాధాన్యతనిచ్చి ఉన్నారు. కేశవ నామాలను సదా తాను స్మరిస్తూ, ఆస్తిక జనులను భగవన్నామ మహిమలో ఓలలాడిస్తూ, నామికి – నామానికి తేడా లేదని, పిలిచినంతనే పలుకుతూ, ఇహశ్రేయస్సును, పరంలోని ఆవశ్యకతను భక్తిమాత్రోపజీవులకు తెలియచెపుతూ సాగింది వారి వైభవం.

మరో ముఖ్య ఘట్టాన్ని, సర్వజీవ సమత్వం మన భరతజాతి ధరించిన పవిత్రవస్త్రంలో ఎన్నో వన్నెలతో ఎలా శోభిస్తుందో గమనిద్దాం. "వాసుదేవుని ప్రేమను సర్వజీవులలోను దర్శించగలిగిన వారు పరమ భాగవతోత్తములు" అంటుంది వైష్ణవ సంహిత. నామబోధేంద్రులకు సమకాలీనులైన శ్రీశ్రీధర వేంకటేశ అయ్యావాల్ అట్టి భాగవతోత్తములే! "అయ్యావాల్" అనగా "పరమపూజ్యభావంతో గౌరవించదగిన వ్యక్తి" అని అర్థం. మైసూరు ఆస్థానంలో మంత్రిగా పనిచేసే 'లింగరాయ'గారి పుత్రులు శ్రీధరఅయ్యావాల్. వేద, శాస్త్ర సమున్నత అధ్యయనం, మహోన్నత ఈశ్వరభక్తి కల్గిన యువకుడైన శ్రీఅయ్యావాల్‌గారికి రాజుగారు దివాన్ ఉద్యోగం ఇచ్చినా సున్నితంగా తిరస్కరించి, భక్తిపథంలో పయనించడానికి మైసూర్ వదిలిపెట్టారు. ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించే క్రమానికి వివాహం ఎన్నడూ అడ్డుకాదని నిరూపించిన మహితాత్ములు వారు. వారు 'లక్ష్మి'గారిని వివాహమాడి గృహస్థుగా తిరుచ్చిలో స్థిరపడ్డారు. భగవన్నామ సంకీర్తన వారి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. ఎవ్వరితోనూ సంగమేర్పరచుకొనక అన్ని జీవులనూ సమాదరించేవారు. భిక్షావృత్తి చేసుకుని జీవించేవారు.

కృష్ణ, ఈశ్వర భక్తి సమంగా ద్యోతకమయ్యేవి. శ్రీకృష్ణ ద్వాదశమంజరి, తారావళి, గంగాష్టకం, ఇలా ఎన్నో భక్తి మరకతాలు వారి కలం నుండి జాలువాలాయి. నామబోధేంద్రులకు శ్రీధర్ అయ్యావాల్ వారికి, ఇరువురికి నామ సంకీర్తనమన్న ప్రీతి. ఒకరు సన్యాసి, మరొకరు గృహస్థు – ఇద్దరూ తరచుగా కలుస్తూ ఎన్నో ఆధ్యాత్మిక విషయక చర్చలు జరుపుతూ భగవంతుని లీలా విశేషమగ్నులయ్యేవారు. శ్రీధర్ అయ్యావాల్ ఎన్నడూ ఎవరితోనూ బేధభావం కలిగి ఉండేవారు



వారి సన్నిధానాన్ని కనుగొనే సమయంలోనే శ్రీరుద్రపాతాన్ని శ్రద్ధగా వల్లెవేస్తున్న శిష్యులతో కూర్చున్న వారి రూపదర్శనమయ్యిందని గుర్తు చేసుకుందాం. పరమాచార్యస్వామివారు వడవాంబలం చుట్టుప్రక్కల ఎప్పుడు విడిది చేసినా ఎక్కువ సమయం ఆత్మబోధేంద్రుల అధిష్ఠాన ప్రాంగణంలో ధ్యానమగ్నులై ఉండి పోయేవారు. మహాత్ముల సన్నిధానాలకు స్వామివారిచ్చిన ప్రాధాన్యతను గమనిస్తే మనం ఆ సన్నిధానాలను ఎంతగా ఆశ్రయించుకోవాలో అవగతమవుతోంది. స్వామివారి ధ్యానమగ్నతను దర్శించినప్పుడు మహాత్ములు పవిత్ర క్షేత్రాలను సందర్శించేది ఆ క్షేత్రాలను మరింతగా పవిత్రం చేసేందుకేనన్న శ్రీబాబూజీ మాటలు తలపుకొస్తాయి.

గురువెంత జ్ఞానగుణరాశిగా శోభిల్లారో వారి తర్వాతి జగద్గురుచంద్రులైన నామబోధేంద్రులు కూడా అంతే మహితాత్ములు. 'పురుషోత్తమన్' అన్న పూర్వాశ్రమ నామధేయులైన వీరు కాంచీపురమునకు దగ్గరలోనే జన్మించారు. యువకుడైన పురుషోత్తమన్ వ్యక్తిత్వము, గుణశీల సంపదను చూసి శిష్యునిగా స్వీకరించి సన్యాసాశ్రమమును ఇవ్వడం జరిగింది ఆత్మబోధేంద్రులచే. గురుశిష్యులిద్దరూ కాంచీ మఠమునందు కొంతకాలమున్నాక ఆత్మబోధేంద్రుల యాత్రాక్రమమున వడవాంబలంలో బ్రహ్మీభూతులవ్వడము-ఆ పిమ్మట అఖిలాండేశ్వరి తాటంక ప్రతిష్ఠ నామ బోధేంద్రులచే జరగడమూ దక్షిణాపథాన వారి విజయయాత్ర సాగడము ఆనందదాయకములు. వారి 'జగద్గురు' నామము సర్వసార్థకమయినది. వీరు 'రామ'నామమును, నామ కీర్తనమును విరివిగా వ్యాప్తి చేసిరి. తరతరాలుగా భగవన్నామ సంకీర్తనకున్న ప్రాధాన్యతను మహాత్ములు గుర్తు చేస్తూనే ఉన్నారు. "కృతయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞయాగాదుల వల్ల, ద్వాపరయుగంలో అర్చనల వల్ల ఎటువంటి మహోన్నత ఫలితాలు కలిగినవో, అట్టి మహాఫలితాలు ఈ కలియుగంలో కేశవుని కీర్తించుట వల్ల కలుగుతాయని" విష్ణుపురాణం చెపితే, "భగవంతుని పవిత్రనామాన్ని సదా గుర్తింపుతో పలకండి. భక్తియనే వృక్షమునకు భగవన్నామమే విత్తు, 'శ్రద్ధ'యే అవసరమయ్యే శుద్ధ జలము" అంటారు కబీర్. "హరునకు నవ్వి భీషణున కద్రిజకుం... అంటూ శివపార్వతులకు, విభీషణునకు, అహల్యకు, ద్రౌపదికి, గజేంద్రునకు అందరికీ ఆత్మబంధువు వలే వ్యథలను తొలగించేది నీ నామమే కదా! అది పతితోద్ధరణం, ఆ నామస్మరణం పవిత్రం, అట్టి నీ నామాన్ని ఎల్లప్పుడూ నా నాలుక మీద ఆడునట్లు చేయి స్వామీ!" అంటారు శతకకారుడు గోపన్న. "హరి... హరి... అంటూ హరినే అయ్యాను" అన్నారు శ్రీసాయిబాబా. "ప్రజలందరి నోట సాయినామం పలకాలి" అని నామ





మీదా పనిచేస్తున్నాడు. స్వీకరించేందుకు మనిషి సిద్ధంగా ఉండాలి. కోరికలో గాఢత ఉండాలి. ఎరుకతో ఉండాలి. విశ్వాసం అవసరం. ఇదే ఏదైనా, ఎప్పుడైనా సాధించేందుకు సూత్రం. మనిషి ఉన్నతమైన దాన్ని సాధించాలనుకుంటే కృషిలోపం లేకుండా ధర్మమార్గంలో ప్రయత్నిస్తే దైవం నుంచి మార్గం సుగమం అవుతుంది. గ్రహించగల శక్తి, దృక్పథం ముఖ్యం. ఆలోచన గల మనిషికి ఎంపిక చేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. జీవితాన్ని సంపూర్ణంగా జీవించే సాహసం కావాలి. **భౌతికత, ఆధ్యాత్మికతల సమతుల్యతను పాటిస్తే ఊహించని మార్గాలు కనిపిస్తాయి.**

కొన్నిసార్లు దేవుడు తలుపులు మూసేస్తాడు. ముందుకెళ్ళే సమయమని ఆయనకు తెలుసు. పరిస్థితులు బలవంతపెడితేగాని మనిషిలో చలనం రాదని తెలుసు. వశమైనప్పుడే రూపాంతరం చెందడం పూర్తవుతుంది. భగవంతునికి లొంగిపోవడానికి మనిషి ఏమీ చేయనక్కరలేదు. అంతరంగంవైపు ప్రయాణం చేసినప్పుడే ఇది సాధ్యం. మనసును పరిశీలించుకుంటూ తనను తాను తీర్చిదిద్దుకుంటుంటే భగవంతునికి దగ్గరగా వెళ్లగలుగుతాం. 'నేను' అనే అహంకారం పూర్తిగా సమసిపోవాలి. విత్తనం భూమిలోకి చేరి ఎలా తన ఉనికికి కోల్పోతుందో అలా మనిషి తన గుర్తింపును పోగొట్టుకోవాలి ఓ తాదాత్మ్యంతో. **(ఏది నామం...ఏది రూపం...ఏది నిను తెలిపేటి వేదం? తన్మయత్వపు తావునుండే పేరు మరచిన ప్రేమతత్త్వం -శ్రీబాబూజీ)** ఆ విత్తనం అంచెలంచెలుగా ఎదిగి ఏళ్ళ తరువాత ఒక వృక్షమవుతుంది. 'శరణాగతి'లో మన ఉనికిని కోల్పోవడం సహజం. అప్పుడు అక్కడుండేది దైవమే. అదే శరణాగతి. భగవంతుడు ప్రాణవాయువులాంటివాడు. మనిషి చూడలేడు కానీ, ఆయన లేకపోతే బతకలేడు.

"నీ దేవుడి శక్తి ఎంత అనే ప్రశ్నకు నీ విశ్వాసం ఎంత అనే ప్రశ్న సమాధానమవుతుంది. విశ్వాసం విషయంలో ఎంత లోతుల్లోకి వెడితే జీవితంలో అంత ఎత్తుకు చేరుకోవచ్చు. ప్రేమ మార్గం చాలా ఇరుకైనది. ఇద్దరికి సరిపోదు. **'నేను'** ఆ మార్గంలో ఉన్నప్పుడు నాకిష్టమైన దేవుడు అక్కడ లేడు. తరువాత ఆయనను చూసేసరికి **'నేను'** అక్కడ లేను" అంటాడో మహానుభావుడు.

శరణాగతి స్థితికి చేరుకున్నప్పుడు ఏ విధమైన ప్రతిఘటనా ఉండదు. ఇష్టాయిష్టాలను బట్టి నడుచుకోవడం ఉండదు. మరో విధంగా మనిషి జీవితంలో ప్రతి క్షణానికీ కృతజ్ఞత కలిగి ఉంటాడు. భగవంతుడు ఏర్పరచిన ప్రణాళికను వ్యతిరేకించడు. జీవిత ప్రవాహాన్ని అనుసరిస్తూ వెళ్ళిపోయే వైఖరిని అలవరచుకుంటాడు. కఠినమైన 'నేను' కరిగిపోతుంది. అనంతమైన కోరికలు మాయమైపోతాయి. జీవితంలో మనిషి తాపత్రయపడే కీర్తిప్రతిష్టలు, అధికార హోదా, ఆస్తిపాస్తులు,



సంబంధ బాంధవ్యాలు కనిపించవు. ఆ ఆకర్షణ ఉండదు. దైవం ముందు అన్నీ వెలవెలాపోతాయి. సర్వం ఆ దైవమే అనే స్థితిలో ఏదీ ఆకర్షించదు. ప్రతి క్షణం దైవస్మరణే.

భౌతిక ప్రపంచంలో పైకి చేరుకోవడానికి నిచ్చెన ఒకటే ఉంటుంది. ఒకరితో మరొకరు పోటీపడుతూ ఆ ఒక్క నిచ్చెనతో పైకి చేరాలి. ఇదే ఆధ్యాత్మిక మార్గంలో దైవాన్ని చేరుకోవడానికి ఎవరి నిచ్చెనలు వారికుంటాయి. ఎవరికి వారితోనే పోటీ. ఎప్పుడూ అన్వేషణ, ప్రార్థన, అవతలివైపు చేరుకునే ప్రయత్నం కొనసాగుతాయి. చివరికి ఆ దైవంతో తాదాత్మ్యం చెందే స్థితి వస్తుంది. ఆధ్యాత్మికత మనిషి బలం కావాలిగానీ, బలహీనత కాకూడదు.

పుష్పం నుండి పరిమళాన్ని వేరు చేసి చూడలేము. అలాగే భగవంతుడి నుంచి గురువుని వేరుచేసి చూడలేము. బుద్ధిమంతుడు అంటే ఏకసంథాగ్రాహి, మహామేధావి అని కాదు. సద్బుద్ధి కలవాడని అర్థం. సద్బుద్ధి అంటే వివేకంతో కూడిన బుద్ధి శక్తి. వివేకం అంటే మంచి చెడుల మధ్య వ్యత్యాసం తెలియడం. **– గురుకృప**

## పూజ్యశ్రీ బాబూజీ అనుగ్రహభాషణం

**Babuji - You Tube Channel Extract**

**భక్తుడు :** “అవధూత” అంటే ఎవరు గురువుగారూ?

**గురువుగారు :** మామూలుగా సంఘంలో, సమాజంలో ఉండేటప్పుడు కొన్ని శాస్త్రాలు చెప్పినటువంటి నియమాల్ని అందరూ పాటిస్తుంటారు. కానీ, ఒక ఉన్నతమైనటువంటి ఆధ్యాత్మికస్థితి పొందడం ద్వారా, ఆ ఆధ్యాత్మికస్థితిలో ఇవన్నీ కూడా ఫాలో చెయ్యాలి అనిపించేటువంటి మనస్సు కూడా వాళ్ళకి రాదు, వాళ్ళ మనస్సుకు తట్టదు. అట్లా వీటినన్నింటినీ కూడానూ విసర్జించినటువంటి వాళ్ళు, వదిలిపెట్టినవాళ్ళు, విడిచివేసిన వాళ్ళు... వాళ్ళను **‘అవధూత’** అంటారు. **‘అవధూత’** అనే సంస్కృత పదానికి కరెక్ట్‌గా అర్థమేమిటంటే **‘విడిచిపెట్టినవాడు’** అని అర్థం. ఏమి విడిచిపెట్టినవాడు? మామూలుగా అందరికీ చెప్పినటువంటి ఈ రిచ్యువల్స్ ఉన్నాయి. సాంగ్యాలున్నాయి. ఫలానా ఆచార వ్యవహారాలున్నాయి, వీటినన్నింటినీ కూడా విసర్జించినటువంటి వాళ్ళు... ఎట్లా విసర్జించిన వారు? ఆధ్యాత్మికస్థితి వల్ల విసర్జించినవారు. ఆ లెక్కకొస్తే మనమందరమూ విసర్జించేసిన వాళ్ళమే. విసర్జించిన వాళ్ళంతా అవధూతలు కాదు. ఆధ్యాత్మికస్థితి పొందినందువల్ల, ఇవేవీ మనస్సుకు రాకుండాపోవడం వల్ల, వాటిని విసర్జించినట్లుగా బయటకి కనిపించేటటువంటివాడు అని అర్థం





“మహర్షి” మాత్రమే ఋషిపుంగవుని కావ్యహృదయాన్ని అనువాదం చేయగల్గుతారు. గురుదేవులు వివరించిన దానిని మరోసారి చింతన చేయవల్సివచ్చింది నాకు. మరుసటి రోజు ఉదయాన్నే ఎస్.వి.ఎల్.గార్ని అడిగి మరికొన్ని వివరాలు తెల్సుకున్నాను. (నేను ధారణ చేయలేకపోయినవి). – ***డా॥ ఎస్. సాయి వరప్రసాద్ రావు, రేపల్లె.***

## గురుకృపాలహరి

మానవజాతి మనుగడ మహాత్ముల అడుగుజాడల వెంటసాగే ఆచరణాత్మక జీవన విధానంలోనే దాగి ఉంది. అన్వేషికి భగవంతుని అస్తిత్వం జీవితగమనంలోని ఎన్నో సందర్భాల్లో తారసపడుతూనే ఉంటుంది. చలనచిత్రాలలో చూపించేటట్లు ఆకాశంలో మెరుపుగానో, విస్తుగొలిపే రూపుగానో దర్శనమివ్వకపోవచ్చు. ఎందుకంటే మనిషి పొందలేనిది ఆ గుర్తింపే. భగవంతుడు కరచరణాదులతో కదిలివచ్చి మనలో, మనతో కదలాడు సమయం – ‘అమృత ఘడియలని’ గుర్తించడం సాధ్యమా! మనకు అందుకు పంచాంగాల ‘పట్టు’లోని అభినివేశం మీద ఆసక్తి ఉంటుంది, కానీ ‘నడయాడే దైవం’ మనతోపాటే ఉంటే ప్రేమ, భక్తి, శ్రద్ధలనే సత్‌గంగాజలాలతో అభిషేకించుకోవాలన్న తలంపు ఎక్కడ ఉంటుంది. దైవం గురువు రూపంలో భాసిస్తూ, అనుగ్రహభాషణంతో జీవిత గమనాన్ని నిర్దేశిస్తూ, తమ జీవితమనే తెరిచిన పుస్తకం ద్వారా ధర్మబద్ధమైన జీవితాన్ని ఆచరించి చరిస్తూ, మార్గదర్శిగా నిలుస్తూ, మాతృత్వపు ఛాయతో, లాలిస్తూ పాలిస్తున్నాడు. రూపంతో నడయాడుతున్నా, గురువు రూప, గుణాలకు అతీతుడు – సమత్వ శోభితుడు. అట్టి సమత, మమత అయాచితంగా, అవ్యాజంగా వర్షిస్తే మానవ జీవిత సాఫల్య సేద్యం చేసుకొని తరతరాలకు ‘గురువనే’ పంటను బండ్లకెత్తుకు గొనిపోవడం వివేకి లక్షణం కదా! గురువును ఉపయోగపెట్టుకునే వివేకమే మనకు వలసింది. గురువు పదముద్రల వెంట ఎలా పరుగులెత్తాలో తెలియడమే మనం నేర్చుకోవలసింది. జగద్గురు పదముద్రలను పరవశంతో పరికిద్దాం... ఆచరించే ప్రయత్నం చేద్దాం... పదండి...

1948వ సంవత్సరం శంకర జయంతి, వ్యాసపూజ, నవరాత్రులు అన్నీ విల్లుపురంలో జరిగాయి. ఇక్కడి నుండి మూడుమైళ్ళ దూరంలోని వడవాంబలంలో 58వ పీఠాధిపతులు శ్రీఆత్మబోధేంద్రుల అధిష్ఠానం పరమ పవిత్ర స్థానంగా అలరారుతోంది. శ్రీరుద్రానికి భాష్యం వ్రాసి, సదాశివ బ్రహ్మేంద్రులను గురురత్న మాలిక వ్రాయమని ప్రోత్సహించిన యోగిపుంగవులు వారు. 1926వ సంవత్సరంలో పరమాచార్య స్వామివారే వారి అధిష్ఠాన్ని కనుగొన్నారని మనం పంచుకున్నాము.



వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే, జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ. ఆవు అనే పదము ఉన్నది. ఇందు రెండు అక్షరాలు ఉన్నవి. ఈ రెండక్షరాలను వినంగానే మనస్సులో ఒక రూపం పొడగట్టుతుంది. ఆ పదము నిర్దేశించే వస్తువు యొక్క రూపం జ్ఞప్తికి వస్తుంది. ఈ రెండక్షరాలు ఒక గుర్తు లేక సంకేతం. ఆవు అనగానే గోవు జ్ఞప్తికి వస్తుంది, లేదా ఆవును చూడంగానే దానికి సంకేతమైన ఆవు అనే మాట మనస్సుకు తట్టుతుంది. వీనికి అవినాభావ సంబంధం. అనగా ఒక దానిని మరియొకటి విడనాడని చెలిమి ఉన్నట్టున్నది. ఈ విషయాన్నే నామరూపాలని పేర్కొంటారు. వీనిలో ఒక దాని నుండి మరొక దానిని వేరు చేయలేము. ఒకటి వాక్కు మరొకటి దాని అర్థము. ఈ వాగర్థాలు ఎలా కలిసి ఉన్నవో అనగా ఒక దానిని మరొకటి వదలక చేరి ఉన్నవో, అట్లే పార్వతీ పరమేశ్వరులు ఒకరినొకరు వదలక, ప్రపంచానికి తలిదండ్రులై ఉన్నారని, వారికి నా వందనములు అని కాళిదాస మహాకవి స్తుతి చేస్తున్నాడు. ఇదే అర్ధనారీశ్వర తత్త్వం.

శబ్దార్థములను, పార్వతీ పరమేశ్వరులతో పోల్చిన కాళిదాసు కవితా వైభవాన్ని విశిష్టంగా వర్ణించారు. అందులోని అర్ధనారీశ్వరతత్త్వాన్ని అమోఘంగా వివరించారు. అన్నింటికంటే అధికంగా ఆకర్షించింది ఏమంటే వారు ఈ తత్త్వాన్ని ఆధ్యాత్మికపరంగా, సద్గురుపరంగా శబ్దార్థాలను, అందులోని ఆంతర్యాన్ని, అంతరార్థాన్ని, అంతరంగాన్ని అక్కడున్న మా అందరికి చెప్పారు.

ఈ ఆలోచనాసరళి కాళిదాసులో ఉందా? అని అప్పుడు నాకు అనిపించింది. ఇంకా వివరించాల్సింది ఉందన్నారు గురువుగారు. ఆ విషయాన్ని మీరే అర్థం చేసుకోవాలి, గ్రహించుకోవాలన్నారు. **అప్పట్లో నాకనిపించిన భావం సరస్వతీదేవి ప్రస్తుతానికి పురుషరూపం ధరించిందా అనిపించింది. అది ఆనాటి సారస్వత విభావరి.**

ఈ రెండు శ్లోకార్థ వివరాలు విన్న తరువాత సంప్రదాయాలనుసారంగా సాగిన విద్యకు, ఆధ్యాత్మిక మార్గంలో అనుభవాన్ని పొందిన మహనీయుల మాటలకు, ఆత్మసాక్షాత్కారమునొంది దివ్యావతరణము నొందిన దైవస్వరూపుల వాక్యములకు ఎంతటి మహిమగలదో అర్థమైంది. వ్యత్యాసములు గూడా అవగతమైనాయి. అందుకనే మహనీయుల వచనములు వేదముకన్నా మిన్నయైనవి. రఘువంశ ఆరంభ ప్రార్థనా గీతానికి ఆధ్యాత్మికతకు, సాధనకు, ఎంతగా ముడిపడి వుందోనన్న విషయం, కాళిదాసు హృదయావిష్కరణ చేసి కావ్యజీవితానికి అనువాదార్థాన్ని అందించడమనే అంశం, మహర్షి సత్తమునికే సాధ్యమౌతుంది. **"నానృషికురుతే కావ్యం"** ఋషికాని వారు కావ్యరచన చేయలేరనే లోకార్థమును పాటించిన రీతిగానే, మహిమోపేతుడు, మహామహోపాధ్యాయుడు, మహనీయుడైన





అవధూత అంటే!

**భక్తుడు :** అంటే వాళ్ళకి ఇంట్రెస్ట్ లేకుండా ఉండటమా?

**గురువుగారు :** ఇంట్రెస్ట్ ఉండదు, మనస్సుకురాదు. ఒక కుక్క వచ్చింది. బాబా పెట్టినటువంటి మూకుడులోని అన్నం తింటోంది. ఆయన వెళ్ళి మళ్ళా మామూలుగా తినేస్తారు. కుక్కకు, ఆయనకూ మధ్య ఉండేటటువంటి ఆ డిఫరెన్స్, కుక్కను కుక్కగా చూడటం అనేది ఆయనకు అస్సలు తట్టదు. మామూలుగా చూస్తే తప్పది. కుక్క ముట్టిన అన్నం తినడమేమిటి? ఆచారం ప్రకారం అయితే అది తప్పు. ఆయన అవధూత! ఇంకా కొంతమందికి ఒంటిమీద బట్టలున్నాయా లేవా? స్నానం చేస్తున్నారా? ఏమి తింటున్నారు? అని కూడా పట్టించుకునేటువంటి స్పృహ ఉండదు. దేహాన్ని గురించి స్మృతి, స్ఫురణ కూడా వాళ్ళకి ఉండదు. వాళ్ళని 'అవధూతలు' అంటారు.

**భక్తుడు :** గురువుగారూ, ఇంట్లో మన దగ్గర బంధువులు ఎవరన్నా చనిపోతే, ఆచారం ప్రకారం ఈ పదకొండు రోజులు ఇంట్లో దేవునికి దీపం పెట్టకూడదు, నైవేద్యం పెట్టకూడదు అంటుంటారు. కానీ మేము మాత్రం తింటుంటాము, మాకు మాత్రం అటువంటివేమీలేవు. కానీ బాబాకు మాత్రం దీపం పెట్టకూడదు, నైవేద్యం పెట్టకూడదు, ఏమీ చెయ్యకూడదు అని అంటారు. ఏదైనా చెప్పడానికి వెళితే మమ్మల్ని అందరూ వేరుగా చూస్తున్నారు. ఇది అర్థం కావడం లేదు గురువుగారూ. ఇట్లాంటి ఆచారాలు ఏంటి?

**గురువుగారు :** మనకు అవసరంలేదు, వాళ్ళు చేస్తే చేసుకోనివ్వండి. కానీ జరిగేది ఏంటనంటే వాళ్ళ పేరు పెట్టి మనమే చేస్తుంటాం. కారణం మనకు లోపల భయం ఉంటుంది. అందుకని పెద్దవాళ్ళు ఒప్పుకోవడంలేదు, ఇంట్లోవాళ్ళు ఒప్పుకోవడంలేదు, మనం పెద్దవాళ్ళ మాట వినకపోతే ఎట్లా? మనల్ని కనిపెంచినటువంటి పెద్దవాళ్ళ మాట వినాలికదా... అవన్నీ ఆ ఒక్క విషయంలో మాత్రమే. ఏదీ, ఇటువంటి ఆచార వ్యవహారాలు పాటించేటప్పుడు మాత్రమే! వాళ్ళకి సరిగ్గా అన్నం పెట్టము, మనం ప్రేమ వ్యవహారాలు చేస్తూ మనకు ఇష్టమైన అమ్మాయిని చేసుకుంటాం, పెద్దవాళ్ళ మాట వినం, మనక్కావాల్సిన ఉద్యోగం చేసుకుంటాం, ఆస్తి వ్యవహారాలు వస్తే వాళ్ళ మీద కోర్టులకు పోతాం, దావాలేస్తాం. కానీ ఆచార వ్యవహారాలొచ్చేటప్పటికి పెద్దలమీద ఎనలేని భక్తి కలుగుతుంది మనకు, లేదా నా భార్య ఒప్పుకోలేదండి, నా భార్యకు కొంచెం చాదస్తమండీ అంటారు. మళ్ళా వీళ్ళే బయటకు వెళ్ళి సత్సంగాలలో బాబా సంప్రదాయం ఇది, గురువుగారు ఇలా చెప్పారు, మనం ఇలా చేసుకోవాలి. అలా చేసుకోవాలి అని వీరలెవల్లో చెప్తుంటారు. కానీ ఇంటికివచ్చి మాత్రం ఇవన్నీ



చేసుకుంటారు. ఏంటయ్యా ఇవన్నీ అంటే, అంతా నా భార్యేనండి, ఆవిడ చేస్తోందండీ అంటారు.

అటువంటివాళ్ళకి నేను చెప్పేదేమిటంటే, ముందు ఇంట్లో మీ భార్యను ఉద్ధరించుకోండి. తరువాత ప్రపంచాన్ని ఉద్ధరించండి. భార్యకే సరైన అవగాహన ఇవ్వలేనివాడివి బయటవాళ్ళకేమిస్తావు? ఆ మాట చెప్పేదానికి అవమానపడాలి. సిగ్గుపడాలి. నా భార్యకి అవగాహన లేదండి, ఆమె కొంచెం చాదస్తం అండీ... నిజానికి చాలా దగ్గర నేను గమనించింది ఏంటనంటే, వాళ్ళు బాగానే ఉన్నారు. వాళ్ళని అడ్డం పెట్టుకుంటున్నారు వీళ్ళు, అంతే. మనం అవన్నీ భయానికి చేస్తాం. వీటిలో మంచీ లేదు, చెడూ లేదు. ఇవి చేయకూడదు, ఇవి చేసినందువల్ల నష్టం అని కాదు. ఇవి ఏమవుతాయంటే... మనకుండేటటువంటి గమ్యం ఏమిటి? మనకుండేటటువంటి లక్ష్యం ఏమిటి? ఈ లక్ష్యం పట్ల మనకెంత శ్రద్ధ ఉన్నది? అనేదానికి ఇవి గీటురాళ్ళలాగా పనిచేస్తుంటాయి. "నాకంతా బాబానే, సర్వస్వం బాబానే, నాకేం చేసినా ఆయనే, నాకు ముక్తికాదు, మోక్షంకాదు, స్వర్గం కాదు, ఏదీ కాదు, ఆయన ఉండేచోటే నాకు స్వర్గం, ఆయన ఇచ్చిందే "మోక్షం"–అనేటువంటి భావన మనలో ఉండేటప్పుడు మిగతావాటి జోలికి మనస్సు ఎందుకు పోతుంది? ఆరోగ్యం బాగాలేదు, వాళ్ళెవరో వస్తారు. ఇలా పూజ చెయ్యండి అంటారు, చేస్తున్నాం. ఇదిగో ఈ శాంతి చెయ్యండి అంటారు, చేస్తున్నాం. ఇదిగో ఆ వాస్తు కొంచెం సరిచేసుకోండి అంటారు, సరిచేసుకుంటున్నాం. జ్యోతిష్కుడొచ్చి ఇంకొకటి చెప్తాడు, అదీ చేస్తున్నాం. అస్సలు ఇవన్నీ కాదండీ, మృత్యుంజయ హోమం చేయించారా? అని ఇంకొకరు వచ్చి అడుగుతారు. ఆహా, చేయించలేదండీ అంటే చేయించండి అంటారు. అదీ చేస్తాం. ఇన్నీ చేసి మళ్ళీ బయటకు వచ్చి మాకంతా బాబానే అని అంటాం. ఎట్లా కుదురుతుంది రెండింటికి? మృత్యుంజయ హోమం కరెక్టా, కాదా? వాస్తు నిజమా, కాదా? జ్యోతిష్యం మంచిదా, కాదా?... ఆ మీమాంస మనకొద్దు. అవి మంచి కావచ్చు, ఏదైనా కావచ్చు. ఉంటే దాన్నే నమ్ముకోండి. బాబానే నాకంతా అని చెప్పకండి. చాలామందికి ఉండేదేమిటంటే అవన్నీ చేస్తే **గురువుగారు** ఇష్టపడరు అని. **గురువుగారు** ఇష్టపడటం కాదు, మీ మనస్సు ఇష్టపడుతుందా?

నాకు బాబా ఉన్నారు. నా ఇష్టదైవం ఆయన, నా గమ్యం ఆయన, నా మార్గం ఆయన అనుకున్నప్పుడు ఇవన్నీ ఎందుకసలు? మనస్సు ఒక రూపం ధరించడము, అన్యమైన భావనలు లేకుండా ఉండటం. **మనకుండేటువంటి ప్రేమ అంతంతమాత్రం, మనకుండే భక్తి ఇంత. మళ్ళీదాంట్లో కూడా షేరింగా?** ఇది బయటి నుంచి చూసేటువంటివాళ్ళకి సంకుచితంగా కనిపించవచ్చు. బాబా





ఆధ్యాత్మికానుభూతి పొందాలనుకొనే ప్రతి సాధకుణ్ణి, గురువుగారు అలాగే చేస్తున్నారనిపిస్తున్నది. ఒకానొక సందర్భంలో **"నేనెవ్వరికీ ఏమీ నేర్పించను–నేర్చుకొనేలా చేస్తానని"** అన్నారు. వారేం చెప్పినా సరే అది బాబాతో ముడిపడి ఉంటుంది. ప్రారంభంలో ఇదెందుకు చెప్తున్నారో తెలియకున్నా అర్థమైన తరువాత అనుభవించే ఆనందం అంతా ఇంతా కాదు. బాబాను మనకు ఎన్ని కోణాల్లో చూపుతారో అర్థమౌతుంది. ఇలాంటి సన్నివేశాన్ని 1992లో చూసినదాన్ని గురుబంధువులకు గుర్వాశీర్వచనంతో విశదీకరించు ప్రయత్నం చేస్తాను.

1992 ప్రాంతంలో మా ఎస్.వి.ఎల్.గారు, మా సాయిప్రసాద్‌గారు, మరికొందరు గురుబంధువులతోపాటు, గురుదేవుల సన్నిధిలో ఉండే మహద్భాగ్యం నాకు లభించింది. రాత్రి పదకొండు గంటలైంది. గురువుగారు వివరిస్తున్న అంశాలను ఆనందంగా ఆస్వాదిస్తున్నాను నేను. అంతరంగంలో ఆరాధన తప్ప అన్యమెరుగనివాడను. అంతటి మహదవకాశాన్ని నాకు అందించిన గురుదేవులకు నా మనస్సులో నమోవాకములు సమర్పించుకొనినాను. ఉన్నట్లుండి కాళిదాసు మహాకవి మీదికి చర్చ మళ్ళింది. సహజాతి సహజంగా సాగిందా సంఘటన–సందర్భము. సాహిత్యమంటే నాకు ఇష్టం. అందులోను కవికుల గురువైన కాళిదాసంటే చెప్పలేనంత ఇష్టం. నాకు ఆనందాన్ని ఇవ్వాలనో, (లేదా) నా తెలివితేటలను గమనించాలనో (లేదా) అందులోని లోతైన భావాలను నాకు తెలియజేసినందువలన భవిష్యత్కాలములో నాకెంతో దోహదకారవుతుందనో, రెండు శ్లోకాలను అత్యంత వివరణాత్మకంగా వివరించారు గురువుగారు మహామహోపాధ్యాయునిలా!

శ్లో॥ ఓంకార పంజర శుకీమ్ । ఉపనిష దుద్యాన కేళి కలకంఠీమ్ ॥
ఆగమ విపిన మయూరీమ్ । ఆర్యా మంతర్విభావయే ద్గౌరీమ్ ॥

తల్లి శక్తి స్వరూపాన్ని వర్ణిస్తుంది ఈ శ్లోకం. పంజరంలోని ఓంకారం అనే శుకం, అంటే చిలుక–ఉపనిషత్తులు అనే ఉద్యానవనంలో ఆటలాడే కలకంఠి, కోయిల. వేదములు అనే వనములలో సంచరించే నెమలి. ఆ పరాదేవి శుకము, కలకంఠి, మయూరి. ఈ మూడింటి సమాహారరూపమే సంగీత, సాహిత్య, నృత్యాత్మకమైన స్వరూపం. ఓంకార రూప చిలుక పలుకులే సాహిత్యం, కోయిల కంఠము నుండి వెలువడే శబ్దమే సంగీతం. ఈ రెండింటినీ అభినయ రూపంలో అందించేది ఆగములనే అడవిలో సంచరించే నెమలి. సమస్త సంగీత సాహిత్య నృత్యాత్మకమై సకల కళా స్వరూపమైన ఆ పరాశక్తి లోలోన ప్రకాశిస్తుంది.



అది చాలా సంతృప్తిని ఇచ్చింది. అప్పటి నుండి అలాగే పారాయణ చేయటం మొదలుపెట్టాను.

ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, నా అంతరంగంలో ఎవరికీ తెలియని, నాకు మాత్రమే తెలిసిన ఒక ప్రత్యేకమైన విషయం కూడా నాకు గురువుగారు చెప్పి పంపించారు. అది నాకు, ఆ భగవంతునికే తెలిసినది. బహుశా నా భార్యకి కూడా తెలిసి ఉండదు. అది నాకు అంత ప్రత్యేకమైనది. నాకు, ఆ భగవంతునికే తెలుసు. గురువుగారు మూడవవారు. అప్పుడు నాకు అనిపించింది, గురువుగారికి అన్నీ విషయాలు తెలుసు. లేకపోతే ఎవరికీ తెలియని నాకు మాత్రమే తెలిసిన అంతరంగంలోని విషయాన్ని ఎలా చెప్పారు! ఆయనకు ఒక విషయం తెలుసు, ఒక విషయం తెలియదు అనటానికి లేదు. గురువుగారు ఒక కంప్లీట్ పర్సన్ (పరిపూర్ణులు).

– *'నామం' జగన్మోహన్‌రెడ్డి*

## "నేనెవ్వరికి ఏమీ నేర్పించను నేర్చుకొనేలా చేస్తాను"

గురువుగారి సన్నిధిలో గడుపుతున్నంతసేపు జీవితం మధురమైందని, ధన్యమైందని అనిపిస్తుంది. ఆ కాలం విలువైందని, మళ్ళీ మళ్ళీ అలాంటి రోజులు, రోజూ రావాలనిపిస్తుంది. వాటిని మాటిమాటికి నెమరేసుకున్నప్పుడల్లా శరీరం రోమాంచితమైపోతుంది. కొన్ని మధురిమలు గుర్తుకొచ్చి ఆనందాన్ని లక్షింతలు చేసినప్పుడల్లా గురువుగారి నోటి నుంచి వచ్చిన ప్రతి పలుకును మనోఫలకం మీద ముద్రించుకోవాలని ఉంటుంది. అలాంటి సందర్భములలో–వచ్చిన వారిలో ఆ మాటల ప్రభావం ఏ విధంగా ఉంటుందని పరిశీలించితే బాబా మీద అపారమైన ప్రేమ, అవ్యాజమైన శరణాగతి చెందటానికి ఉపకరణమైనది. ఇందుకు మూలం గురువుగారి పలుకులే. ఏకాంతంలో ఉన్నప్పుడు సరిసాటియైన గురుబంధువు లభించినప్పుడు ఈ విషయాలను తలపోస్తున్నప్పుడు జరుగుతున్నదేమిటి– మనకుగా మనకు తెలియకుండానే బాబాకు సంబంధించిన విషయాలను మాటిమాటికి మననం చేసుకోవడం జరుగుతున్నది. బాబా తలంపులను ఆలోచింపచేస్తున్నది. మనకుగా మనకు తెలియకుండానే గురువుగారు మనచేత "సాయిభక్తి సాధన" చేయిస్తున్నారనిపిస్తుంది. ఇది రహస్యంగా కొనసాగుతున్న సాధన, అందరిలోను, వారి ప్రమేయం లేకుండానే గురువుగారు మనందరిచేత బాబాకు సంబంధించిన యాక్టివిటీని చేయిస్తున్నారు. ఈ సందర్భంలో గురువుగారు కబీరులా కనిపిస్తున్నారు. కబీరు భావానికి తెలుగు సేత.

**"ప్రాణాయామములు, పూజా పునస్కారములు పలుమారులు చేయమని పల్కు గురువు కన్నా సహజ సమాధి స్థితికి చేర్చు గురువే మిన్న భోగములందు యోగము చూపించువారే గురువు"**





సకల దేవతాస్వరూపుడండీ, మరి అన్ని దేవతలకూ పూజ చేస్తే తప్పేంటి? మామూలుగా చెప్పేటటువంటి డైలాగ్ అది. ఆయన సకల దేవతాస్వరూపుడని నిజంగా నువ్వు నమ్మితే, మిగతా దేవతలకు పూజ చేయడం ఎందుకు? ఆ మాట అంటున్నామంటే మనకు నిజంగా నమ్మకం లేదు అని అర్థం. బాబాకు పూజచేస్తే సకల దేవతలకూ పూజ చేసినట్టేగా! కాబట్టి **మనలో ఉండేటువంటి ప్రేమ ఇంక ఎవ్వరికీ షేర్ కాకుండా అక్కడే ఉండటమనేటువంటిది భక్తి యొక్క స్వరూపం.** నారద భక్తిసూత్రాల్లో మొట్టమొదటి సూత్రం ఏమిటి? భక్తికి ఆయనిచ్చిన నిర్వచనం ఏమిటి? "అనన్య ప్రేమాభక్తి:".

అనన్య ప్రేమ అంటే ఏమిటి? నీకుండేటువంటి ప్రేమ ఇక అన్యమైన వాటిమీద, దేని మీదా ఉండకుండా పోవడం. అది దేవుళ్ళు కావచ్చు, ఆచారాలు కావచ్చు, మిగతా వ్యక్తులు కావచ్చు, ఏదైనా కావచ్చు. అది తప్పితే ఇంక అన్యమైనటువంటి ఏ వస్తువువైపుకి, వ్యక్తివైపుకి మన ప్రేమ వెళ్ళకపోవడం అనేటువంటిది భక్తి. అటువంటి భక్తి మనకు బాబా మీద ఉంటే మనం సాయిభక్తులం.

కాబట్టి ఈ డెఫినిషన్ ప్రకారం చూసినట్లయితే మనం శిష్యులమా, భక్తులమా అనంటే, ఇందాక నేను సాయిభక్తులం అన్నాను, ఆ రెండోది కూడా కొంచెం అనుమానించాల్సి వస్తుంది. కాబట్టి అవేమీ తప్పనికాదు, మనకు వాటి యొక్క మీమాంసా వద్దు, వాటిల్లో ఆర్ర్యుమెంట్సూ వద్దు. మన శాస్త్రాలు కూడా చెప్పిన మాట అదే. మనమేమీ దీంట్లో సాంప్రదాయాన్ని గౌరవించకుండా పోయేదేమీ లేదు.

శాస్త్రాలు ఏం చెప్పాయనంటే, ఒక్కొక్కరూ ఒక్కొక్క ఉపాసనా మార్గానికి వెళ్ళి, ఆ ఉపాసనా దైవాన్ని తీసుకొని, ఏకాంతంగా, అంటే మనస్సు ఇంక అన్యం లేకుండా దాన్నే ధ్యానించడం ఉపాసన అని. కొందరు విఘ్నేశ్వరుణ్ణి ఉపాసనాదైవంగా పెట్టుకుంటారు. వాళ్ళు విఘ్నేశ్వరుణ్ణే ధ్యానించాలి. ఇంకో దేవుణ్ణి ధ్యానించకూడదు. వాళ్ళు సాయిబాబాని పూజ చేయకూడదు. కొంతమంది శివుడు, కొంతమంది విష్ణువు, కొంతమంది రాముడు, కొంతమంది కృష్ణుడు, ఎక్స్, వై, జెడ్... మనస్సు అక్కడే ఉండాలి అంతే. అంతే తప్పితే ఎ టు జెడ్ ఆల్ఫాబెట్స్ అంతా ఉండకూడదు.

అట్లా మనస్సు ఒక్క రూపం ధరించడం అనే సూత్రాన్ని ఆధారం చేసుకొని మనం సాయిభక్తులం అనుకుంటున్నాం గనుక లేదా సాయిభక్తులం కావాలనుకుంటున్నాం గనుక మన మనస్సు బాబా రూపాన్నే ధరించడం అనేది రావాలి. అదీ ఉపాసన! ఎక్కడైనా మనంగానీ దీంట్లో తప్పుచేస్తే, లోపల మనం ఎంతవరకు బాబా మీద ఆధారపడుతున్నాము, బాబా పట్ల మనకు ఎంతవరకు ప్రేమ ఉన్నది అనే విషయం మనకు తెలుస్తూంటుంది. ఇవి మనకు గీటురాళ్ళు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి



వాళ్ళని, వీళ్ళని అడ్డం తీసుకురాకండి. మనం ఏమీ మానుకోవడం లేదు, తీర్థయాత్రలు మానుకోవడం లేదు, హోమాలు మానుకోవడం లేదు, శాంతులు మానుకోవడం లేదు, వాస్తులు మానుకోవడంలేదు, జ్యోతిష్యాలు మానుకోవడంలేదు. పదిరాళ్ళలో బాబా కూడా ఒక రాయి. ఆ చేసేటటువంటివి, ఆ ఎనర్జీ అంతా కూడా బాబా మీద పెట్టండి. లేదూ, ఇంకో దానిమీద పెట్టండి. నేను బాబా మీదనే పెట్టమని చెప్పడంలేదు. మనస్సు ఏ రూపమైనా ఒక రూపం ధరించాలి. లేకపోతే అది మానసిక వ్యభిచారమవుతుంది. సద్గురువు అంటే, ఇష్టదైవం అనంటే మన మనస్సు అనేటువంటి స్త్రీ స్వరూపానికి భర్తలాంటివారు. పతివ్రత అయినటువంటి స్త్రీ ఎట్లాగైతే భర్త రూపం తప్పితే ఇంకో రూపాన్ని మనస్సుకు రానివ్వదో, మన మనస్సు కూడా బాబా పట్ల అట్లా ఉండాలి. అలా లేకపోతే మానసిక వ్యభిచారమవుతుంది. **'సాయినాథా'** అన్నామంటే మనందరికి కూడానూ ఆయన నాథుడు.

రమణమహర్షి అన్నట్లుగా, ఆయన వ్రాసినదాంట్లో ఏం వ్రాశారాయన? అరుణాచలేశ్వరునికి ఆయన ప్రియురాలు అన్నారు. మనస్సు అనేటువంటిది స్త్రీ రూపం, అందుకని ఆయన నాథుడు. మనకు సద్గురువాయన. కాబట్టి మనం పతివ్రతులుగా ఉంటామా, ఇంకో రకంగా ఉంటామా అని ఆలోచించుకోండి. పతివ్రత అంటే బాగాలేదు కనుక గురువ్రతులు అనండి, బాగానే ఉంది. సాయివ్రతులు అనండి, దైవవ్రతులు అనండి. ఎవరైనా ఆ దైవాన్నే మనసులో పెట్టుకోవాలి.

**భక్తుడు :** గురువుగారూ! బాబా దగ్గర మార్గమూ, గమ్యమూ ఒకటే అన్నారు కదా. మార్గమూ, గమ్యమూ ఒకటే ఎట్లా?

**గురువుగారు :** మనకు దారి చూపించినవాడూ ఆయనే, మనం చేరేదీ ఆయన దగ్గరకే. ఇప్పుడు నిన్ను చెయ్యి పట్టి దారి పొడవునా తీసుకెళ్ళారనుకో, తీసుకెళ్ళిన తర్వాత మనం ఎక్కడికి చేరాలంటే ఆయన దగ్గరకే చేరాలి. ఆయన దగ్గరకే మనం చేరేది. అది మనకు అర్థంకాదు. అర్థంకాక ఇంకేదో అనుకుంటాం. దాసగణు మహరాజ్ దృష్టిలో ఏంటనంటే భగవత్ సాక్షాత్కారం అనేటువంటిది గమ్యం అని, బాబాలాంటి గురువు దానికి మార్గం చూపిస్తారు అనే కాన్సెప్ట్ ఉండేది. ఆయన కాన్సెప్ట్ అది. ఆయన రోజూ వచ్చి కూర్చొని నాకు సాక్షాత్కారం కావాలి, సాక్షాత్కారం కావాలి అని అడిగేవాడు. బాబా నవ్వి ఏం మాట్లాడకుండా గమ్మునవుండేవారు.

ఒకరోజు దాసగణు వచ్చి "సాక్షాత్కారం కావాలి" అన్నారు. బాబా నవ్వి, గమ్మునుండి పోయారు. గట్టిగా మరీ మరీ అడుగుతుంటే, **"ఇదేరా సాక్షాత్కారం అంటే"** అన్నారు బాబా. ఆ౦ మీరు ఇట్లాంటి





నేను ఆయనతో "ఏమండీ... నామం తగ్గించి, ఇలా పారాయణ పెట్టారు, కానీ పారాయణ ఎలా చేయాలో నాకు తెలియదు. నేను పారాయణ చేస్తుంటే డిఫరెంట్‌గా ఉండి, ఇక్కడి వాళ్ళు కోప్పడతారేమో, గురువుగారు ఏమంటారో ఏమో! నాకు తెలియదు కదా, ఏమి చేయమంటారు" అని ఆయనను అడిగాను. దానికి ఆయన, "ఏమీ కాదు సార్, గురువుగారు రూమ్‌లో ఉంటారు కదా, మీరు పారాయణ చేస్తుంటే ఆయన అన్నీ వింటుంటారు కదా, ఏమన్నా ఉంటే, ఆయన దగ్గర నుండే మీకు ప్రతిస్పందన వస్తుందిలెండి. మీరు పారాయణకి పేరు ఇవ్వండి. మీకు వచ్చినట్లే పారాయణ చెయ్యండి, అన్నీ గురువుగారు చూసుకుంటారు కదా!" అని అనడంతో నేను కూడా పేరు ఇచ్చాను. లిస్ట్‌లో నేను నాలుగవవాడిని. నాకు చదవడానికి మూడవ చాప్టర్ వచ్చింది, రెండవ చాప్టర్ చదివిన వ్యక్తి అతనిది పుస్తకం పూర్తికాగానే చదవడానికి నాకు బుక్ ఇచ్చారు. నేను అప్పటివరకు సాయి సచ్చరిత్ర పుస్తకం కూడా చూడలేదు. అందులో ఏముంటుందో కూడా నాకు తెలియదు. అది తెలుగులో ఉంటుందని మాత్రమే నాకు తెలుసు. నాకు ఆ మూడవ చాప్టర్ చదవటానికి 35 నిమిషాలు పట్టింది. అందరిలా కాకుండా ఎక్కువ సమయం పట్టింది. ఎందుకంటే, నేను గద్యాన్ని పద్యంగా చదివాను. ప్రతి పేరాకి ఒక్కొక్క రాగం పెట్టుకుంటూ చదివాను. నేను చదవటం మొదలుపెట్టిన ఐదు నిమిషాలకు సత్సంగహాల్‌లోకి ఎక్కువమంది గురుబంధువులు వచ్చారు. ఏంటి ఈయన...భిన్నంగా ఇలా చదువుతున్నాడు అనుకుంటున్నారు. నేను పారాయణ చేయటం పూర్తికాగానే ఒక గురుబంధువు గురువుగారి రూమ్‌లో నుండి బయటకు వచ్చి "మీరు చదివిన దాని గురించి గురువుగారు చాలా మెచ్చుకున్నారు" అని చెప్పగానే చాలా సంతోషమేసింది. పారాయణ అయిన తర్వాత శ్రీనివాసులరెడ్డిగారి కోసం చూస్తుంటే, నేను పారాయణ చేస్తున్న సమయంలో ఆయన గురువుగారి దగ్గరే ఉన్నారని తెలిసింది. కొంత సమయం తరువాత శ్రీనివాసులరెడ్డి గారితో, నేను పారాయణ చేస్తున్నప్పుడు మీరు గురువుగారి దగ్గరే ఉన్నారు కదా, అక్కడ అసలు ఏమి జరిగిందో చెప్పండి అని అడిగాను. ఆయన ఇలా చెప్పటం మొదలుపెట్టారు. 'అయ్యా... నేను రూమ్‌లో ఉన్నప్పుడు గురువుగారి రెండు చేతులలో రెండు పుస్తకాలు ఉన్నాయి. వాటిని తీసుకొని అల్మరాలో పెట్టటానికి ఆయన లేవగానే మీరు పారాయణ మొదలుపెట్టారు. మీరు చాలా భిన్నంగా చదువుతున్నారు. మీరు మొదలుపెట్టటంతోనే బుక్‌ని అల్మరాలో పెట్టటానికి లేచిన గురువుగారు రెండు పుస్తకాలను చేతులలోనే ఉంచుకొని అలాగే నిలబడి ధ్యానంలోనే ఉండిపోయారు, మీది పూర్తవగానే కళ్ళు తెరచి ఒక మాట అన్నారయ్యా... "చెవిలో అమృతాన్ని వినిపించాడయ్యా!" అని అన్నారట. ఈ 35 నిమిషాలు గురువుగారు అలాగే నిలబడిపోయారట.



నా గురువుకు భజనంటే ఇష్టం. అందువలన మొట్టమొదట నేను ఆ పనే చేస్తాను. పోతే, నేను చేసే భజన ఏమని? సాయిబాబా...సాయిబాబా.. అని. ఇక్కడ నేను ఆయన భజనే చేస్తుంటే, బాబానే పిలుస్తుంటే గురువుగారు ఎంతో సంతోషిస్తారు. నాకు అంతకంటే ఆనందం ఏముంటుంది? నాకు ఒకరోజు ఒక సందేహం కలిగింది. మనం చేస్తున్న భజనలన్నీ గురువుగారు వింటున్నారా? లేదా? అని. ఆ సందేహం ఎలా తీరాలి? ఎవరిని అడిగినా ఏమని చెబుతారు. అది ఎలాగైనా మనమే తెలుసుకోవాలి. గురువుగారిని టెస్ట్ చేయాలి అని సంకల్పించుకున్నాను. దానికి నేను ఒక ప్లాన్ వేసుకున్నాను. ఏంటంటే, అప్పుడప్పుడు నాకు భజన చెప్పటానికి 10, 15 నిమిషాలు అవకాశం ఇచ్చేవారు. నేను ఈ రోజు నామానికి ఒక రాగం సెలక్ట్ చేసుకొని చెబుతాను. ప్రొద్దునే గురువుగారు దాని మీద నన్ను పిలిపించడమో లేదా దానికి సంబంధించి ఏదైనా చెప్పి పంపించడమో చేయాలి. అలా చేస్తే గురువుగారు మన భజనలు వినినట్లు, లేకపోతే విననట్లు అని ప్లాన్ చేసుకొని ఒక వారం రోజుల పాటు ప్రయత్నించి ఒక రాగాన్ని ప్రిపేర్ చేసుకొని భజన చెప్పటానికి రెడీ అయ్యాను. అందులో భాగంగా నేను సెలక్ట్ చేసుకున్న 'యమునా కళ్యాణి' అనే రాగంలో ఒకరోజు నామం చెప్పాను. ఆ రాగం ఎలా ఉంటుందంటే చాలా స్లో స్పీడ్. అంతకంటే స్లోగా ఎవరూ నామం చెప్పలేరు. నేను కావాలనే ఆ స్లో స్పీడ్‌లో నామం చెప్పాను.

ప్రొద్దున్నే నారాయణరావుగారు వచ్చి రాత్రి మీరు చెప్పిన నామం గురించి గురువుగారు ఇలా చెప్పమన్నారు అంటూ గురువుగారు చెప్పి వివరాలు అన్ని చెప్పారు. గురువుగారు ఊరకనే బాగుంది అని చెప్పటమే కాదు, ఆ రాగానికి సంబంధించిన వివరాలు అన్నీ కూడా చెప్పి పంపించారు. అంటే, ఈ రాగంలో నామాన్ని ఎప్పుడు, ఏ పరిస్థితులలో, ఎలా చెప్పాలి, ఎప్పుడు చెప్పకూడదు, ఆ రాగంలో చెప్పే విధానం, ఆ రాగం యొక్క విశిష్టత ఆ రాగం యొక్క ప్రత్యేకత... ఇలా ఆ రాగానికి సంబంధించిన అంశాలన్నీ గురువుగారు చెప్పినవన్నీ నారాయణరావు గారు వచ్చి చెప్పారు.

సాయి సచ్చరిత్ర అనే పుస్తకం ఒకటి ఉంది, దానిని పారాయణ చేస్తారు అనే విషయం నాకు నిజంగా అప్పటికి తెలియదు. నేను ఒక్క భజన మార్గంలోనే ఉండిపోయాను. ఇక వేరే మార్గాలవైపుకి పోతే మనసు స్థిరంగా ఉండదని వేరే ఏదీ చేయలేదు. ఇది ఇలా ఉంటే అనుకోకుండా ఒకరోజు శిరిడీలో ఈ వారం అంతా సాయిసచ్చరిత్ర పారాయణ జరుగుతుంది. ఒక వారం మగవాళ్ళు, ఒక వారం ఆడవాళ్ళు పారాయణ చేయాలి. అందువలన భజన సమయం కూడా తగ్గించాము అని అనౌన్స్ చేసారు. అప్పుడు మాతోపాటు శిరిడీలో ఒంగోలు శ్రీనివాసులరెడ్డిగారు కూడా ఉన్నారు.





మాటలు చెబుతుంటారులే, నాకు అట్లాంటిది కాదు, సాక్షాత్కారం కావాలి. "సాక్షాత్కారం అంటే ఏంటి? **స+అక్షాత్కారం"** అన్నారు. అంటే కంటి ముందు కనిపించేటువంటిది అని అర్థం. కంటి ముందు ఒక భగవత్స్వరూపం కనిపిస్తే అదే సాక్షాత్కారం. అక్కడ ఎదురుగా కళ్ళముందు కనిపిస్తోంది భగవత్స్వరూపం. కానీ అది అతనికి సాక్షాత్కారం అనిపించడంలేదు. కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చుంటే ఏదో కలలాగా వస్తే అది సాక్షాత్కారం. అదే దాసగణు మహారాజ్‌కి బాబా సమాధి అయిపోయిన తర్వాత కలలోకి వస్తే దాన్నే మళ్ళీ ఆయన సాక్షాత్కారం అన్నాడు. ఇప్పుడు మనకి బాబా కనిపిస్తే సాక్షాత్కారం, మరి ఆ రోజు కనిపిస్తేనో? ఆ రోజు అతనికి అర్థం కాలేదు. అరే, **భగవత్ స్వరూపాన్ని** ఎదురుగా, కళ్ళెదురుగా పెట్టుకొనివున్నాను. కానీ గుర్తించలేకపోయాను, ఆయన మార్గమనే అనుకున్నాను, గమ్యం అని అనుకోలేదు అని తరువాత వాపోయాడు. ఇప్పుడు మనకు బాబా కనిపించారనుకోండి, మరి అది సాక్షాత్కారమేగదా? మరి అప్పుడు ఉండేవాళ్ళకందరికీ సాక్షాత్కారం అయినట్టేగా లెక్క! 'అక్షం' అంటే కళ్ళు. సాక్షాత్కారమంటే కళ్ళకు కనిపించడం, కంటికి ఎదురుగా కనిపించడం. కాబట్టి ఆయనే మార్గం, ఆయనే గమ్యం.

**భక్తుడు :** గురువుగారూ, శ్రీమతి తర్ఖడ్ శిరిడీ వచ్చినప్పుడు ఆవిడ భోజనం చేస్తూ ఒక రొట్టెముక్క కుక్కకు పెడుతుంది. తరువాత ఆమె మసీదుకి వెళ్ళాక నాకు భోజనం బాగా పెట్టావమ్మా అని అంటారు బాబా. అంటే అన్ని జీవుల్లోనూ నేనే ఉన్నాను అని తెలియజేయడానికి ఎవరో ఒకరి ద్వారా చెప్పాలి కాబట్టి బాబా ఆవిడను ఎన్నుకున్నారా లేకపోతే ఆవిడ యొక్క గొప్పతనం ఉండి వుంటుందా?

**గురువుగారు :** బాబా ఆమెకు చెప్పదలచుకున్నారు. చెప్పారు. అంతే. ఆమె ద్వారా చెప్పించడమూ కాదు, ఆమె గొప్పతనమూ కాదు. ఆ అనుభవం రావడానికి ఆమె సరైనటువంటి పరిస్థితిలో ఉంది. అందుకని ఆ అనుభవం ఆయన ఇచ్చారు. నిజానికి బాబా ఇచ్చినటువంటి అనుభవాలు, అన్ని లీలలూ అలాగే ఉన్నాయి. అన్ని జీవుల్లోనూ ఉండేటువంటిది తామేనూ అని చూపించడమే!

**భక్తుడు :** ఇందాక చెప్పిన సాక్షాత్కారంలో, మనకి బాబా కలలోకి వచ్చి ఏదైనా సూచనలను చెప్పారనుకోండి, అంటే ఇప్పుడు మీరు ఫిజికల్‌గా మాకెదురుగా ఉన్నారు. మీరు డైరెక్ట్‌గా చెప్పిన సూచనలను, కలలో చెప్పిన సూచనలను మేము ఎలా కో-రిలేట్ చేసుకోవాలి?

**గురువుగారు :** కో-రిలేట్ చేసుకోవడానికి రెండూ డిఫరెంట్‌గా ఉంటే ఎదురుగా చెప్పిందే కరెక్ట్. నన్నడిగితే డిఫరెంట్‌గా ఉండే అవకాశం ఉండదు. ఏముంటాయనంటే, ఎదురుగా చెప్పడానికి



కొన్ని లిమిటేషన్స్ ఉండేటప్పుడు కలలో కనిపించడం ఉంటాయి. కొన్ని విషయాలు నేను డైరెక్ట్‌గా చెప్పను ఎవ్వరికీ. నాకు కొన్ని పద్ధతులున్నాయి. వాళ్ళకు అవసరం ఉండేటప్పుడు కొంతమందికి అలా చెప్పడం ఉంటుంది.

**భక్తుడు :** మీరు మాకు డైరెక్ట్‌గా చెప్పనటువంటి విషయాలు మాకు కలలో కనపడి చెప్పారు అని మాకు అనిపిస్తే, అవి మా స్వకల్పితాలే అనుకోవాలా లేక ఎట్లా అనుకోవాలి గురువుగారూ?

**గురువుగారు :** అర్థం కాలేదయ్యా, ఒక ఉదాహరణ చెప్పు.

**భక్తుడు :** అంటే నేను ఉదాహరణ వెంటనే చెప్పలేకపోతున్నాను, ఆలోచించి చెబుతాను.

**గురువుగారు :** చెప్పు.

**భక్తుడు :** సార్, మీరు బాబాయే మార్గం, గమ్యం అన్నారు. మేము మెటీరియల్ లైఫ్ లీడ్ చేస్తూ బాబాయే మార్గం, గమ్యం అనేవి ఎట్లా తీసుకోవాలి సార్? అది రెండు పడవల మీద కాళ్ళు పెట్టినట్లు కాదా?

**గురువుగారు :** ఇంకో పడవ నీకు కనిపిస్తే! నీకు ఇంకొక పడవ ఎక్కడ కనిపిస్తోంది? కనిపించే పడవ ఒక్కటే, ప్రాపంచికం. రెండవ పడవ ఏది? రెండు పడవలు లేవు. ఒకటే పడవ ఉండేది.

**భక్తుడు :** గురువుగారూ! అహానికి, అహంకారానికి ఏమన్నా డిఫరెన్స్ ఉందా, లేకపోతే రెండూ ఒకటేనా?

**గురువుగారు :** పదాల గురించి ఎందుకయ్యా ఆలోచిస్తారు? తెలుగు క్లాస్ చెయ్యకండి సత్సంగాన్ని. ఏ డిక్షనరీ చూసినా తెలుస్తుంది అహానికి, అహంకారానికి డిఫరెన్స్ ఏంటి అని. అది చెప్పడానికి నేను కావాలా? నేను తెలుగు అయ్యవారినా? అహానికి కారం కలిపితే అహంకారం. అహం అంటే మనకు ఎప్పుడూ ఉండేది, కొంచెం ఘాటుఘాటుగా కోపం వచ్చినప్పుడు, ఏయ్ నాకు ఇది కావాలి, అది కావాలి అనేది అహంకారం. ఆ పదం తెలుసుకున్నావు. దానివల్ల ఏంటి ఉపయోగం? అహం అంటే ఇది, అహంకారం అంటే ఇది అని తెలిసింది. దానివల్ల మనకి ఉపయోగం ఏమిటి?

ఈ ఆధ్యాత్మికత, నేర్చుకోవడం, సత్సంగాల పేరుతో ఏం చేస్తున్నామనంటే, ఒక రెండు మూడు పదాలు చెప్తాము... ఆత్మ అంటే ఇది, ముక్తి అంటే అది, ఇదంటే ఇది అని చెప్పిన, దానికి నాలుగు డెఫినిషన్లు చెప్తాము. ఏమిటి దానివల్ల ప్రయోజనం?

ఆత్మాభిమానానికి, ఆత్మగౌరవానికి తేడా ఏమిటి? ఇంకొక ప్రశ్న. ముక్తికి, మోక్షానికి తేడా ఏమిటి? ఉపాసనకి, సాధనకి డిఫరెన్స్ ఏమిటి? తెలుసుకున్నావు. అయితే దానివల్ల ఏంటి





ఎంతమందికి సాధ్యం... ఆలోచిద్దాం... జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసినా ఎప్పుడూ 'ఫిర్యాదు' భావన లేకుండా, "నా అవసరాలన్నీ గురువుగారికి తెలుసు, నేను చింతించడమెందుకు" అనే ఆలోచనతో గురువుగారికి తన వ్యక్తిగత అవసరాల గురించి అంతగా చెప్పేవారు కాదు. 'గురువుగారి' ఆలోచనలతో సాగే గురుబంధువుల సాహచర్యాన్ని బాగా కోరుకునే వారు, ఆనందించే వారు. అసూయకు ఆమడ దూరంలో ఉంటూ, శ్రీవారితో గడిపిన క్షణాలు, ఆ రోజుల్లో ఉన్న మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ, పంచుకుంటూ అరుణాచలంలో గడిపారు. నమ్మిన విశ్వాసాలను చివరికంటా ఎలా పాటించాలో గురుదేవుల వద్ద తెలుసుకున్న తాను 'సాయిపథం' బ్యాడ్జీని ఎప్పుడూ ధరించేవారు. అనారోగ్యంతో ఉన్న కొద్దిరోజుల్లో కూడా తన బ్యాడ్జీని తడుముకోవడం గురువుగారు తనతో ఉండాలన్న భావన వారి మనసులో ఎంత బలంగా ముద్రించుకుపోయిందో మనకు అర్థమవుతుంది. మీ పేరు అని అడిగితే "సాయిబాబా అని పిలుస్తారు" అన్న బాబా మాటను శృతివాక్యంగా ఏ ప్రక్షిప్తాలు చేరని స్వచ్ఛమైన భగవన్నామం "సాయిబాబా". అట్టి నామాన్ని సదా స్మరిస్తూ మనలోనూ ఆ పరిమళాన్ని నింపి సాయిపదైక్యమయిన జగన్మోహనరెడ్డిగారికి అంజలి ఘటిస్తోంది 'గురుకృప'. వారి కుటుంబానికి ఎనలేని ధైర్యం ఇవ్వాలని గురుదేవులను ప్రార్థిస్తోంది. భాగ్యవంతులుగా జీవించాలనుకోవడం సహజం - భాగ్యవంతుడిగా జీవించడం గమనం - "గురువే భాగ్యమనుకోవడం - ధన్యం. సాయిబాబా నామస్మరణతో బాబానే పిలుస్తూ గమనంలో బాబాతోనే ఉన్న రెడ్డిగారు గమ్యంలోనూ శ్రీసాయిసద్గురుచరణాలను చేరారు. శరశ్చంద్రుల అనుగ్రహ భాగ్యాన్ని సాయినామంగా బండ్లకొద్దీ తీసుకెళ్ళి తన ఖజానాలో నింపుకున్న రెడ్డిగారు ధన్యజీవి.

- గురుకృప

నేను మొదటి ఐదు సంవత్సరాలు (1998–2003) భజన చేయటం తప్ప ఇంకేమీ చేయలేదు. ఒకసారి గురువుగారు శిరిడీలో పదమూడు రోజులున్నారు. నేను ఆ పదమూడు రోజులు బాబా మందిరానికి కానీ, గురుస్థాన్ కానీ ఎక్కడికీ వెళ్ళలేదు. కేవలం భజన చేసేవాడిని లేకపోతే రూమ్‌కి వెళ్ళి పడుకునేవాడిని. ఒకరోజు ఒక గురుబంధువు వచ్చి నన్ను అడిగారు, ఏమండీ... మిమ్మల్ని కొన్ని రోజుల నుండి చూస్తున్నాను, మీరు బాబా దర్శనానికి కూడా వెళ్ళటం లేదు, ఇక్కడ భజన మాత్రమే చేస్తున్నారు. ఇలా చేస్తే మీకు సాయిబాబా దగ్గర నుండి హెల్ప్ ఎలా వస్తుంది? మేము ప్రతిరోజు మందిరానికి వెళుతున్నాం. గురుస్థాన్ దగ్గర ప్రదక్షిణలు చేస్తున్నాం అన్నారు. అప్పుడు వారికి ఇలా సమాధానం చెప్పాను, అయ్యా... నేను భజనలోనే ఎందుకు ఉండిపోయాను అంటే,



## సద్గురు సమ్మోహనం - సాయినామ జగన్మోహనం

### సాయినామ ప్రేమికుని స్మృతిలో

నాహం వసామి వైకుంఠే నయోగి హృదయే రవౌ
మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద॥

"నేను వైకుంఠంలోగాని, యోగుల హృదయమందిరాలలోనూ కాక ఎక్కడ నా 'భక్తులు' నన్ను గానం చేస్తుంటారో అక్కడ తిష్ఠవేసుకుని కూర్చుంటాను" అంటాడు విష్ణువు - ప్రహ్లాద భక్త విజయంలో. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగానరసం ఫణిః" పశువులు, పక్షులు, పాములు, శిశువులూ ఇలా అన్ని జీవులనూ పరవశింప చేసే శక్తి సంగీతానికి ఉంది. జగన్మోహనరెడ్డిగారు మనందరికీ ప్రీతిపాత్రులు. ఎనభై వసంతాలు పైబడిన బాలుడు. నిన్న మొన్నటిదాకా ఉదయం జరిగే అంతర్జాల సత్సంగ కార్యక్రమంలో 'సాయిబాబా' నామాన్ని ఎంతో ఉత్సాహంగా, ఉత్సవంలా చెప్పిన 'అంకుల్' గురుచరణాల్లో ఐక్యమయ్యారు. సద్గురు సంకల్పమేమోగానీ, మనం కొన్ని సంచికల నుండి వారి అనుభవాలను చదువుకుంటూ సద్గురు స్మరణలో ఓలలాడుతున్నాం.

"మన ఇష్టదైవం పట్ల ప్రేమతో వ్యక్తం చేసే ప్రతీ పనిపూజే!" "ఒకవేళ మీరు నిజంగా ఏమన్నా చెయ్యాలనుకుంటే మీ ప్రతిభా పాటవాలను బాబాకు అర్పించండి. అది మీ మనస్సుకు ఎంతో తృప్తిని ఇస్తుంది. ఇలా నివేదన చేస్తున్నంతవరకు మీరు ప్రేమతో బాబాను గుర్తుపెట్టుకుంటారు". "మనం చేసే పని మనల్ని ప్రభావితం చేస్తుంది. మనం చేసే పని వలన ప్రభావితం కావడం మన స్వాభావిక ధర్మం. కాబట్టి సత్సంగంతో, బాబాతో లేదా మీరు ప్రేమించే ఏ విషయానికి సంబంధించిన పనులలో అయినా సరే పాలు పంచుకోండి" అంటారు శ్రీబాబూజీ. కమ్యూనిష్టు భావాలు, నాస్తిక ఛాయలలో సాగిన జీవితం ఒక్కసారి గురువుగారిని చూసాక పూర్తిగా మారిపోయిందని జగన్మోహనరెడ్డి గారి గురించి సన్నిహితులు చెపుతారు. సినిమాల నిర్మాతగా, అలనాటి మేటి ఆర్టిస్టులకు, సంగీత, గాయక కళాకారులకు, ఆప్తులైన రెడ్డిగారు 'సాయినామాన్ని' సర్వంగా చేసుకుని, నగర సంకీర్తనతో సాయినామాన్ని ఆలపించుకుంటూ 'మేలు'కొలుపుగా సాగేవారు గురుదేవులున్నచోట. వారి అనుభవాలను వారి మాటల్లోనే వింటున్నాం కనుక వారి గురించి నాలుగు మాటలు పంచుకోవాలనిపించింది. వయసు మీద పడ్డా నిత్యశిశువులాగే ఉండటం వారికే ప్రత్యేకం. ఎవరో ఏదో అనుకుంటారని కాకుండా వీడియోలు తీసుకోవడం, నామస్మరణను రికార్డు చేసుకోవడం, వందమంది గురుబంధువులు తనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారని సంతోషించడం ఇలా 'తృప్తి'గా జీవించడం మనలో





ఉపయోగం? అందుకని ఈ పేర్లు, ఈ జార్గన్ జోలికిపోవద్దు. అవి ఊరికనే టైమ్‌పాస్ కోసం మాట్లాడుకోవడానికి బాగుంటాయి. ముక్తి అనే కాన్సెప్ట్ తీసుకొని గంటసేపు లెక్చర్ కొట్టవచ్చు.

**భక్తుడు :** గురువుగారూ, ఇందాక ముక్తి అన్నారు కదా. అది మనకు అవసరంలేదు అని వదలివేయడం మేలంటారా? దాన్ని పొందడానికి ప్రయత్నం చేయవచ్చంటారా? వేరే ఏదైనా విషయాన్ని మనకు అవసరం లేదని వదిలివేయడం మేలంటారా? లేదా తెలుసుకొనే ప్రయత్నం చేయమంటారా?

**గురువుగారు :** ప్రయత్నం చెయ్యి, తెలుసుకొనే ప్రయత్నం చెయ్యి. నిజంగా తెలుసుకొనే ప్రయత్నం చేయడమంటే ఏమిటి? ముక్తి అంటే ఎట్లా తెలుసుకొంటావు? ముక్తినిపొంది తెలుసుకుంటావు. లేకపోతే తెలుసుకున్నట్లు కాదది. ముక్తి అనే పదానికి అర్థం తెలుసుకున్నావు. కాబట్టి ఆ ముక్తి అనేటువంటిదాన్ని తెలుసుకొనేదానికి నువ్వు ముక్తి పొందు. ముక్తి అంటే నీకేమైనా తెలుసా? వాళ్ళేదో ఒక డెఫినిషన్ ఇచ్చారు ముక్తి గురించి, అది మనకు కావాలా ఇప్పుడు? ఇప్పుడు మనకు ఏంకావాలి? మనకు దుఃఖం ఉంది. మనకు ఇబ్బంది ఉంది. మనం ఆ దుఃఖంలో నుంచి విముక్తి పొందాలి. మనకు ఎటువంటి దుఃఖం ఉంటే అటువంటి దుఃఖం నుండి. ఇప్పుడు ఈ సత్సంగంలో అక్కడ వర్షంలో తడిసే దుఃఖం వాళ్ళకు వుంది (వర్షం పడుతోంది ఆ ప్రాంగణంలో) అందులో నుంచి వాళ్ళు ముక్తిపొందాలి. ఇక్కడ మీరు కొంచెం చోటిస్తే వాళ్ళకు ముక్తి వస్తుంది.

"నువ్వు ఎవరో తెలుసుకో" అన్నారు. మంచిదే. వినేదానికి చాలా బాగుంది. కానీ ఇప్పుడు మన ప్రాబ్లమ్ అదా అని? మీలో ఎవ్వరికైనా సరే, నువ్వు ఎవరో నీకు తెలియకపోవడం వలన ఎవరికైనా దుఃఖం ఉందా? ప్రస్తుతానికి మనకు కాదది. మన మనసుకి అది వచ్చినప్పుడు, ఆ జిజ్ఞాస మనలో కలిగినప్పుడు ఆలోచిద్దాం. రమణమహర్షికి అటువంటి అనుభూతి కలిగింది. అసలు 'తను' అంటే ఏమిటి? అది తెలుసుకోవాలనే ఆ స్ఫురణ, ఆ తెలియనటువంటిది ఏమిటి అనే ఆ జిజ్ఞాస ఆయనకు కలిగింది. ఆ తెలుసుకోకపోవడం అనేటువంటిది దుఃఖం అయింది అని ఆయన తెలుసుకున్నాడు. ఆయన భగవానుడయ్యారు. ఆయనకు వచ్చింది కదా అనే ఉద్దేశ్యంతో, మనకు జిల పుట్టకపోయినా గీరుకోవడం వల్ల ఏమవుతుంది? పుండవుతుంది. మనకు లేదు ఆ జిజ్ఞాస. మనకు తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయి. గ్రీన్‌కార్డ్ ఎట్లా వస్తుంది, వీసా తొందరగా ఎలా వస్తుంది? మనకు వంద డాలర్లు ఎక్కువ పొందేలా ఉద్యోగం ఎలా చేసుకోవాలి, అదే కదయ్యా మనకు కావలసింది. తెలుసుకోవడం అనేది తప్పుకాదు, కాబట్టి మనకు అవసరమైనవి తెలుసుకోండి. లేకపోతే ఏమవుతుందనంటే ఏదో



మనకు తెలియనటువంటి, మనకు అవసరం లేనటువంటి, మనకు అర్థం కానటువంటి ఊరకనే పేర్లు మాత్రమే తెలుసుకొని వాటిని సాధించడం కోసం ప్రయత్నం చేస్తున్నామని మనల్ని మనం ఆత్మవంచన చేసుకొని, మనల్ని మనం మభ్యపెట్టుకొంటుంటాం. ఏం చేస్తున్నావు అనంటే సెల్ఫ్ ఎంక్వయిరీ అంటాం. అక్కడ కూర్చున్నప్పటి నుంచి సెల్ఫ్ ఎంక్వయిరీ వీడు ఎక్కడున్నాడు? వాడు ఎక్కడ తిరుగుతున్నాడు? వీడు ఏ అమ్మాయితో తిరుగుతున్నాడు? వాడికి ఉద్యోగం వచ్చిందా? రాలేదా? వాడి విషయం ఏమిటి? అని లోపల మనస్సులో ఈ ఎంక్వయిరీ జాస్తి అవుతుంది. వాడు సెల్ఫ్ ఎంక్వయిరీ సెల్ఫ్‌లెస్‌గానే చేస్తుంటాడు ఎప్పుడూ. కాబట్టి ఫస్ట్ మనం తెలుసుకోవాల్సింది మనకేంటి అవసరం? అది ఎలా వస్తుంది, ఎవరిస్తారు? ఇప్పుడు మనం ఉండేటువంటి స్థితిలో మనకు ముక్తి అవసరమైతే, అదీ ఇస్తారాయన.

మనకు ఉండేటువంటి ప్రాపంచికమైన ఏవో కొన్ని సమస్యలు మన మనసుని చీకాకుపరుస్తున్నాయి. వాటిలో నుంచి మనం విముక్తి పొందాలి, వాటి నుంచి మనం ముక్తిపొందాలి, వాటిని ఎట్లా పొందాలి? మన ప్రయత్నం మనం చేస్తాం, అయినా మనం సాధించలేనప్పుడు ఆ ఇచ్చేవారి ముందు చెయ్యి చాపుతాం. ఆయన ఇస్తే, ఆయన ఇస్తున్నారు గనుక ఆయన్ని ప్రేమిస్తాం. ఆయన్నే ప్రేమిస్తాం, ఆయన్నే ప్రేమిస్తూ ఉంటాం. అదే భక్తి, ఇందాక నేను చెప్పింది అదే. కాబట్టి మనకు ఏమి కావాలో అదే మనకు గమ్యం అవుతుంది.

అందుకనే బాంబే నుంచి వచ్చిన సేఠ్‌కి జేబులో డబ్బుని చూపి, "నీ భగవాన్ నీ జేబులోనే ఉన్నాడురా" అన్నారు బాబా. అతనికదే భగవానుడు. కాబట్టి మనకేం కావాలి అని ఆలోచించండి. జనరల్‌గా 99శాతం మందికి ముక్తి అనేటువంటిది పెద్ద అవసరంగా తోచదు గనుక అది నేను వద్దంటాను. అంతే తప్పితే ముక్తి తప్పనికాదు. ముక్తి మనకు అవసరం అనిపిస్తే చెయ్యండి, ముక్తి కోసం పాటుపడండి, సాధించండి. మనం ఎప్పటికైనా సాధించాల్సింది అదే, దాన్ని నేనేమీ కాదనడంలేదు. ముక్తి అనవసరం అని కాదు. నువ్వు ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా అవుతావా అంటే ఊహూ, నాకేమి అవసరం లేదండి అంటాం, మనకు అవసరం లేకపోవడం వల్ల మనం కానట్లుగా.

**భక్తురాలు :** మనలో ఉండే ఏ తప్పులైనా అంటే కోపం రావడంగాని, ఇంకేమైనాగానీ కానివ్వండి... వాటిని పోగొట్టుకునేదానికి ప్రయత్నించేటప్పుడు అది కూడా బాబాకి దగ్గరవుతున్నట్టేనా, గురువుగారూ?

**గురువుగారు :** ప్రయత్నిస్తే దగ్గరవుతావు. ప్రయత్నం చేస్తే దగ్గరవుతావు.

**భక్తుడు :** గురువుగారూ, బాబాను ఏదైనా కోరిక అడిగినప్పుడు, అది తీరడం, తీరకపోవడం అనేది





మనం తయారు చేసుకుంటున్నాం. అదీ బాబా మార్గంలో ఉండేటువంటి విశేషం. ఇవన్నీ వదిలిపెట్టేస్తే నువ్వు అది పొందుతావు అనేటువంటిది కాదు ఇక్కడ పద్ధతి. మనకు ఏవైతే అడ్డాలుగా ఉన్నాయో ఆ అడ్డాలే మనకు సోపానాలవుతాయి. మనకు Obstaclesగా ఉండేటువంటివే మనకు Stepping Stones అవుతాయి. అది బాబా మార్గంలో ఉండే విశేషం. అర్థమైందా నేను చెప్పింది?

**భక్తుడు :** అర్థమైంది గురువుగారూ.

**గురువుగారు :** కోరిక వదిలిపెట్టేయండి, దేని గురించి ఆలోచించకండి, ప్రాపంచికమైన కోరికలు మనకు ఎందుకు? బాబా ఎప్పుడూ అలా చెప్పరు. **"నువ్వు కోరినవన్నీ నేను ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలుచుకుంది నువ్వు అడిగేంతవరకు"**. కాబట్టి మన కోరికలనేటువంటివి, మామూలుగా చూసినట్లయితే ఆధ్యాత్మికతకు కోరికలనేవి అడ్డాలవుతాయి. కానీ మనకవే బాబాకు దగ్గర చేసేటువంటి సాధనాలవుతాయి. మీలో ఎక్కువ మంది అలా బాబా దగ్గరకు వచ్చినవాళ్ళే కదా! మరి ఆ కోరికలు తప్పెందుకువుతాయి? కోరికలు అనేటువంటి రకరకాల మిషలతో మనల్ని దగ్గరకు తీస్తున్నారాయన. ఆ రకమైన మార్గం, మనం ఉండే చోటునే మనల్ని ఉంచుతూ అక్కడ నుండి మనల్ని తీసుకురావాలి. దాన్ని మరలా కరెక్ట్‌గా చెప్పాలంటే, ఈ కోరికలంతా విడిచిపెట్టినటువంటి యోగి వేమన చెప్పినది మళ్ళా అర్థం చేసుకోవాలి. **"ఇహము లేదు పరము కలదను వాడి మాట కల్లమాట".** "ఈ ప్రాపంచికమంతా ఉత్తదేనూ, ఇదంతా మాయ, ఇదంతా భ్రమ, ఇదంతా బూటకం, ఉండేదంతా కూడానూ ఆ బ్రహ్మమే,ఆ పరమాత్మే. ఆ ఆత్మతత్వాన్ని మీరు పొందండి, ఈ ప్రాపంచిక విషయాల గురించి ఆలోచించకండి, ఇదంతా ఏం లేదు" అని ఎవడైనాగానీ చెప్పాడా వాడి మాట కల్లమాట. అబద్ధం. **"ఇహములోన పరము చూపువాడు సద్గురువు" అదీ బాబా చెప్పింది. – సాయిపథం, శిరిడీ**

శీల నిర్మాణం ఎంతో అవసరమన్న మాట మరచి 'అతను ఎంతో గొప్ప భక్తుడండీ, గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టాడు, 20సార్లుగంట కొట్టాడు' అని ఏదో పెద్ద గొప్ప విజయాన్ని సాధించినట్లుగా తెగ మెచ్చుకుంటాం. మెత్తగా కనబడుతూ సాధువులాగా, ధర్మనిష్టునిలాగా ఉంటటం ఒక గొప్ప గుణం అని అనుకుంటాం. 'నేను అబద్ధం ఆడనండీ' అయితే ఏమిటండీ? 'ఆవు కూడా అబద్ధం ఆడదు కదా! అది ఆవుగానే ఉంది' అని స్వామి వివేకానంద అంటారు. దీని వలన నీలో సత్తాలేని విషయం ఋజువు అవుతుంది. నీ వలన ఇతరులకు ఏమీ మేలు జరగలేదు. 'స్వార్థం నుండి నీవు బయటపడి ఇతరులకు ఏమైనా మేలు చేయగలుగుతున్నావా?' అని ప్రశ్నించినపుడు 'అవును' అని అనగలిగితే అప్పుడు అది గొప్ప గుణం అవుతుంది. అంతేకాని ఒట్టిమాటల వలన ఏమీ జరగదు. శూన్యవాదం నుండి బయటపడి నిశ్చయమైన కార్యసాధన విధానాన్ని అవలంబించినట్లయితే అది అభ్యుదయం అవుతుంది. 'నేను మీకు ఏ విధంగా సహాయ పడగలను?' "నేను మీకోసం ఏమి చేయగలను?' అనే పరోపకార బుద్ధి పెంపొందాలి. **– స్వామి రంగనాథానంద**



ఇష్టంలాగా. ఆ హోటల్ ఇష్టం కాదు మనకు, ఆ హోటల్‌కి పోతే తిండి దొరుకుతుంది అని. గురుబంధువు కనిపిస్తే నువ్వు గురువు గురించి మాట్లాడుకోవచ్చు. నీ ప్రేమను వ్యక్తం చేసేదానికి అవకాశముంది. కాబట్టి ఆనందంగా అనిపిస్తుంది. అదేనా నువ్వడిగిన ప్రశ్న?

**భక్తుడు :** అంటే అన్ని సందర్భాలలో గురువు గురించి మాట్లాడుకునే అవకాశం రాకపోవచ్చు కదా?

**గురువుగారు :** రాకపోయినా సరే, తెలుస్తుంటుందిగా మనసుకు. అవేర్‌నెస్ ఉంటుందిగా, నేను, అతను... మన ఇద్దరికి కూడానూ బంధం అక్కడ అనే విషయం తెలుస్తుంటుందిగా!

**భక్తుడు :** గురువుగారూ! ఎలాంటి సిట్యుయేషన్లోనైనా ఎప్పుడూ హ్యాపీగా ఉండాలంటే ఎట్లా?

**గురువుగారు :** ఎప్పుడూ సంతోషంగా ఉండాలంటేనా? నీ ప్రశ్న వినబడలేదు, మళ్ళీ చెప్పు.

**భక్తుడు :** How to be happy

**గురువుగారు :** తెలుగులో చెప్తే నాకర్థమవుతుంది.

**భక్తుడు :** మనమెప్పుడూ సంతోషంగా ఉండాలి. పరిస్థితుల ప్రభావం కాకుండా, వ్యక్తులతోనూ, కారణాలతోనూ, ప్రయత్నాలతోనూ సంబంధం లేకుండా మనం హ్యాపీగా ఉండాలి అంటే ఎలా?

**గురువుగారు :** నాకు తెలిసిన మార్గం బాబానే. బాబా పట్ల మనకుండేటువంటి ప్రేమ. మనకు సంబంధించినవి బాబా చూసుకుంటారు, బాబా మనకు రక్షణగా ఉన్నారు. ఆ సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ ఉంది. కల్పవృక్షంలాగా మన కోరికలు తీరుస్తున్నారు, మనకవసరమైనప్పుడు ఆయన తీరుస్తారు అనేటువంటి స్ఫురణ మనకి ఉండేటప్పుడు Unhappinessకి అవకాశమేది? సంతోషం కాక మిగిలేదేది? సంతోషంగా కాక వేరే రకంగా ఉండటానికి మీకెట్లా వీలుపడుతుందసలు? అట్లా ఉండటం కోసమే ఈ సత్సంగాలుగాని, ఇలా కూర్చోవడంగానీ, ఇవన్నీ కూడానూ. ఏ చీకూచింతా లేకుండా, ఎటువంటి భయమూ లేకుండా హ్యాపీగా ఉండటం. **"ఆనందజీవనం సాయిపథం"**. దానికోసమే ఇదంతా. దీనికి మార్గమేమిటంటే బాబా, బాబా పట్ల మనకుండేటువంటి ప్రేమ. అది ఉంటేచాలు. ఇంకేమీ అక్కర్లేదు. అవి రావడం కష్టం గనుక నేనేమి చెప్తున్నానంటే మనకుండే చీకూచింతలు అనేటువంటి వాటినే అది పొందేదానికి మనం మార్గం క్రింద తయారుచేసుకుంటాం.

మనం చీకూచింతలు తీర్చమని బాబాను అడుగుతాము. అవి తీర్చిన తరువాత, ఆయన తీరుస్తున్నాడు కదా అని ఆయనపట్ల ప్రేమ పెరుగుతుంది. కాబట్టి వీటినే దానికి ఉపయోగపెడదాం. మనకు ఏవైతే ఆనందాన్ని దూరం చేస్తున్నాయో వాటినే వలవేసి బాబాను పొందే దానికోసంగా





బాబా ఇష్టంగా మనం తీసుకున్నట్లయితే....

**గురువుగారు :** నీకు అవసరమైనది బాబా తీరుస్తారు. అర్థమైందా? **ఎప్పుడు తీరిస్తే నీకు మంచిదో అప్పుడు తీరుస్తారు.**

**భక్తుడు :** అంటే కొన్నిసార్లు బాబా వల్ల తీరిందన్న...

**గురువుగారు :** ఆయన తీర్చేటప్పుడు, ఆయన వల్లే తీరింది అనే అనుభవం కూడా ఇస్తారు. దానికి మనకు దిగులేమీ అవసరంలేదు. ఆయన పద్ధతి అది. డెలివరీ ఇచ్చేటప్పుడు ముద్ర వేసిగానీ ఇవ్వరాయన.

**భక్తుడు :** ఇప్పుడు ప్రెజెంట్‌లో జరిగే విషయాలకు మాత్రం ఆయన ఇస్తారా లేదా అన్న డౌట్‌లో ఉంటాము. తర్వాత ఆయన ఇస్తారు అని ఉన్నాగానీ, ప్రెజెంట్‌లో మాత్రం, ఇప్పుడు జరిగే వాటిలో మాత్రం...

**గురువుగారు :** విడిచిపెట్టేసెయ్. ఆయన ఇవ్వలేదనుకో, మనకు అది ఇస్తారన్న నమ్మకం కూడా ఇవ్వలేదనుకో, విడిచిపెట్టెయ్యి. బాబాను విడిచిపెట్టేసి, ఇంకెక్కడైనా ఎవరన్నా ఇస్తే తీసుకో. **"మ్రొక్కిన వరమీయని వేల్పు గ్రక్కున విడవంగవలయున్"** అన్నారు. మ్రొక్కితే వరమీయని వేల్పుని మనమెందుకయ్యా పట్టుకొని ఊగులాడటం? వదిలేసెయ్యి.

**భక్తుడు :** అంటే, ఇంక ఇస్తే ఈయనే ఇవ్వాలి, లేకపోతే ఇంక ఎవ్వరూ ఇవ్వలేరు కదా సార్. అప్పుడు...

**గురువుగారు :** అప్పుడు నువ్వు చేయగలిగింది కూడా ఇక ఏమీ లేదు (నవ్వులు). అట్లా పడివుండటమే, అంతే. ఇంక వేరే మార్గం లేదు. ఏం చేయమంటారని అడిగితే నేనేం చెప్పేది? చెప్పేదానికేం లేదు. నేను చెప్పినా నువ్వు చేయగలిగిందేమీ లేదు.

**భక్తుడు :** కానీ ఇప్పుడు వర్రీ అవుతూ ఉంటాం కదా సార్.

**గురువుగారు :** వర్రీ అవ్వు, వర్రీ కావడం వల్ల పెద్ద నష్టం ఏముంది? ఇచ్చినా కూడా నువ్వు వర్రీ అవడం ఏమైనా మానేస్తావా? మరోదానికైనా వర్రీ అవుతూ ఉంటావు. అందుకనే ఆయన **గమ్యం చేరుస్తాను** అని చెప్తూ, **నిశ్చింతంగా ఉండు** అని చెప్పిన కారణం కూడా అదే. మనం నిశ్చింతంగా ఉండకపోతే, మనకు చింతే మిగులుతుంది, అంతే. ఇచ్చేది ఆయన ఎలాగూ ఇస్తారు. లేదూ, ఇవన్నీ కూడానూ ఊరకనే మన మనసుని మభ్యపెట్టుకొనేటువంటి ఆలోచనలు, అంతా ఐవాష్ బిజినెస్ ఇది, ఆయన ఇచ్చేదీలేదు, పెట్టేదీలేదు అని అనుకున్నట్లయితే వదిలిపెట్టేసెయ్యి. వెళ్ళిపోయి చక్కగా



ఎవరు ఇస్తే వాళ్ళ దగ్గరకు వెళ్ళండి. ఆయన ఇస్తారు అని ప్రామిస్ చేస్తూ మీరు ఆయన్నే నమ్ముకోండి అని నేను ఎప్పుడూ చెప్పను. మీ అనుభవాన్ని మీరు నమ్ముకోండి. ఎందుకివ్వాలి గ్యారంటీ మీకు. మీ కోరికలు అసలు ఆయన ఎందుకు తీర్చాలి? ఆయన వంద కోరికలు తీర్చారు, నూట ఒకటవ కోరిక తీర్చలేదట ఆయన. అలగడం, బాబా నాకేం చేసారు అనడం. మీకెందుకు చెయ్యాలి అసలు? చెప్పండి. నూరూ అయిపోయాయి, నూట ఒకటవ దానినే పట్టుకుంటాం. మనం విడవలేము, ఎందుకంటే నూరు చేశారు అనేటువంటిది మనకి జ్ఞాపకముంటుంది. ఈ నూరూ ఎందుకు చేశారాయన అనంటే నూట ఒకటవది ఆయన చేయకపోయినా కూడా ఆయన మన మంచికే చేస్తారు, నూరు చేసినవాడు నూట ఒకటవది చేయడం లేదనంటే దీనికేదో కారణముండాలి అనేటువంటిది రీజనబుల్‌గా, రేషనల్‌గా తడుతుంది. ఆ మాత్రం కామన్‌సెన్స్ ఉంటుంది అని పాపం ఊహిస్తారాయన. మనకది లేదని అనిపిస్తే వదిలేసెయ్యండి. ఏ వారెంటీలూ లేవు, గ్యారెంటీలూ లేవు, ఓదార్పు లేదు. కొంచెం ఓపిక పట్టండి బాబా తీరుస్తారు అని నేనెప్పుడూ చెప్పను. **మీ ఓట్లు ఆయనకు అవసరం లేదు. మీ దండాలతో ఆయనకి పనిలేదు. ఇచ్చెనమ్మా వాయనం అని చెప్పి ఇచ్చిందాకా దేవుడే, ఇవ్వకపోతే ఆయన దేవుడు కాదనుకోవడం. ఇది ప్రేమా? మళ్ళా మనం ప్రేమ, ముక్తి మోక్షం... వీటి గురించి మనం మాట్లాడుతుంటాము. బాబాను ప్రేమించడమంటే ఏమి ఇచ్చినా, ఏమీ ఇవ్వకపోయినా, మన తల్లిదండ్రులు పేదవాళ్ళైనా మనం వాళ్ళనెట్లా ప్రేమిస్తామో, మన బిడ్డలు ఎంత అయోగ్యులైనా వాళ్ళని మనం ఎట్లా ప్రేమిస్తామో, అట్లా... ఆయన నిజంగా చేతకానివాడే కావచ్చుగాక, అయినా కూడా నేను ప్రేమిస్తాను.**

**అందుకనే నేను చెప్పింది... నేను బాబాను ప్రేమిస్తున్నాను. నేను బాబాను ప్రార్థన చేస్తున్నాను. పూజిస్తున్నాను అనంటే ఆయన దేవుడుగనుక అని కాదు, ఆయన దేవుడు కాకపోయినా నాకు బాధలేదు. నాకు తెలిసి ఆయనే దేవుడు. "దేవుడు ఆయన కాదు, ఆయనే దేవుడు". రెండింటికీ ఎంత తేడా ఉందో చూడండి. ఆయన నాకు స్వర్గాన్నిస్తాడని కాదు, ఆయనుండేదే స్వర్గం. ఆయన లేకుండా ఒకవేళ నేను స్వర్గంలో (సో కాల్డ్ మిగతావాళ్ళ ఆలోచన ప్రకారంగా) ఉన్నా నాకా స్వర్గం అవసరం లేదు. అదీ ప్రేమంటే! ఏదైనా చిన్నది ఇవ్వలేదని అలిగేయడం కాదు. ఒక్కసారి నేను చెప్పిన పద్ధతిలో ఆలోచించండి.**

**భక్తుడు :** గురువుగారూ, బాబాపై ప్రేమ పెంచుకోవడం, లైఫ్ క్వాలిటీ పెంచుకోవడం... ఇవి రెండూ ఒకదానిపై మరొకటి ఆధారపడి వుంటాయా?



**గురువుగారు :** అవి రెండూ వేరే వేరే ఎందుకవుతాయి? బాబా మీద ప్రేమ పెంచుకోవడం, లైఫ్ క్వాలిటీ పెంచుకోవడం రెండూ ఛాయిస్‌లు కాదు. అంటే ఇది వస్తే అది రాదనా నీ ఉద్దేశ్యం? అంటే లైఫ్‌లో క్వాలిటీ కావాలా, లేకపోతే బాబా పట్ల ప్రేమ కావాలా అనా? క్వాలిటీ అంటే ఏంటి? వాట్ డూ యూ మీన్ బై క్వాలిటీ?

**భక్తుడు :** క్వాలిటీ అంటే అసూయ, ద్వేషం ఇటువంటివన్నీ...

**గురువుగారు :** అవి క్వాలిటీయా? అంటే అసూయాద్వేషాలుంటే క్వాలిటీ లైఫ్ అని అర్థమా?

**భక్తుడు :** అవి లేకుండా ఉండటం గురువుగారూ.

**గురువుగారు :** దానికి, బాబాపట్ల ప్రేమ పెంచుకోవడానికి ఏమిటి? రెండూ ఆల్టర్నేటివ్స్ కాదే!

**భక్తుడు :** రెండింటికీ ఏమన్నా రిలేషన్ ఉంటుందా?

**గురువుగారు :** ఉంటుంది. ఇవి తగ్గుతూ ఉంటే బాబా పట్ల ప్రేమ పెరుగుతుంది. బాబా పట్ల ప్రేమ పెరిగితే ఇవి తగ్గిపోతాయి. అసూయ ఎందుకొస్తుంది? ఇంకొకదానిమీద ప్రేమ ఉంటే, అది మనం పొందలేకపోతే వస్తుంది. బాబాపట్ల ప్రేమ ఉన్నప్పుడు దానిపట్లా, మిగతా వాటిపట్ల మనకి ప్రేమ ఉండదు, మనకి అసూయా రాదు. కాబట్టి ఇవన్నీ ఒకదానికొకటి లింక్‌గా ఉంటాయి.

**భక్తుడు :** గురుబంధువుల మధ్య రిలేషన్ షిప్ ఎలా ఉండాలి గురువుగారూ?

**గురువుగారు :** గురుబంధువుల్లాగా ఉండాలి. బంధం అంటే బంధింపబడివుండటం. బంధం అంటే ఒక అటాచ్‌మెంట్. **గురువుతో సంబంధానికి మన మధ్య బంధముండాలి,** మన మధ్యలో ఇక వేరే బంధాలు ఉండకూడదు. ఈ ప్రశ్నకు ఇంకేమైనా విశేషార్థాలు, విపరీతార్థాలు ఏమైనా ఉన్నాయా? నాకర్థం కాలేదు. గురుబంధువుల మధ్య రిలేషన్‌షిప్ ఎట్లా ఉండాలి అంటే నాకు అర్థం కాలేదు. గురుబంధువుల్లాగా ఉండాలి. ఇంకెలా ఉండాలి.

**భక్తుడు :** అంటే ఇప్పుడు రోడ్డు మీద వెళ్తున్నప్పుడు ఒక ఫ్రెండ్ ఎదురయ్యాడు. అతనితో మాట్లాడుతాము. తరువాత గురుబంధువు ఎదురయితే అతనితో కూడా మాట్లాడుతాము. అంటే వాళ్ళతో మన రిలేషన్‌షిప్ ఎట్లా ఉండాలి.

**గురువుగారు :** గురుబంధువు కలిసినప్పుడు, ఆ గురుబంధువు మనకి మన గురువుపట్ల ఉండే ప్రేమని ట్రిగ్గర్ చేసేవాడిలాగా కనిపిస్తాడు. అక్కడ ఉండేటువంటిది గురుబంధువు పట్ల ప్రేమకాదు, గురువుపట్ల ప్రేమే వ్యక్తమయ్యేది. దీనికి He happens to be a trigger. అందుకని ఎక్కువ అటాచ్మెంట్ ఉంటుంది. బాగా ఆకలి ఉంది, తిండి కావాలి అనుకునేటప్పుడు హోటల్ మీద మనకుండేటువంటి